RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం
PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 6 ఆగస్ట్ 2026 గురువారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:59

# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు అనుమతులు ఇప్పించండి సీఎం రేవంత్ రెడ్డి





న్యూఢిల్లీ: ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి , రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి జల్శక్తి మంత్రిత్వ శాఖ కార్యాలయంలో కేంద్ర మంత్రి తో సమావేశమయ్యారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్శక్తి శాఖకు పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తు చేశారు. 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మాణంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (అచిఖఖీూ) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రి కి వివరించారు.

అచిఖఖీూ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందని తెలిపారు. ముంపులో 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని చెప్పారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా అవసరమైన నీటి సరఫరా సాధ్యం కాదని, అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి కోరారు.తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని తెలిపారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా వల్ల విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని వివరిస్తూ, ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్శక్తి మంత్రి సీఆర్ పాటిల్ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి ఏర్పడుతుందని వివరించారు.

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్శక్తి మంత్రి ముఖ్యమంత్రి కి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , వేం నరేందర్ రెడ్డి , డాక్టర్ మల్లు రవి , రామసహాయం రఘురాంరెడ్డి , పోరిక బలరాం నాయక్ , గడ్డం వంశీకృష్ణ , డాక్టర్ కడియం కావ్య , ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి , నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ , నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ , ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### బెదిరింపులకు భయపడేది లేదు..

# రాహుల్ గాంధీని కలిసిన విద్యార్థి నిరసనకారులు



ఇటీవల సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలతో వార్తల్లో నిలిచిన విద్యార్థులకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అండగా నిలిచారు. వారు "రాజ్యాంగ సంరక్షకులు" అని అభివర్ణించిన రాహుల్, తమ హక్కుల కోసం పోరాడుతున్న వారు ఎవరికీ క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన విద్యార్థులు, ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకుని వైరల్ అయిన యువతితో కలిసి బుధవారం ఆయన తన నివాసం (10 జన్?పథ్) వెలుపల మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. "ఈ యువత, వీరిలాంటి వేలాది మంది భారతీయ యువకులు చేసిన దానికి నేను గర్వపడుతున్నాను. వారు రాజ్యాంగాన్ని, భారత దేశ స్ఫూర్తిని, దేశ భవిష్యత్తును కాపాడారు. లోపభూయిష్టంగా, కుప్పకూలిపోతున్న పనికిమాలిన వ్యవస్థకు వ్యతిరేకంగా గళం విప్పడం నేరం కాదు. వారు తమ ప్రజాస్వామ్య హక్కును మాత్రమే వినియోగించుకున్నారు" అని అన్నారు.

క్షమాపణ వివాదంపై ఆగ్రహం

జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనలో 15 ఏళ్ల బాలిక ప్రధాని నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత కేసు నమోదు కావడంతో ఆమె సోషల్ మీడియాలో క్షమాపణ చెప్పిన విషయం తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బాలికను భయపెట్టి, బలవంతంగా క్షమాపణ చెప్పించారని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో రాహుల్ స్పందిస్తూ.. విద్యార్థులపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పుపట్టారు."విద్యార్థులు శాంతియుతంగా, ఎటువంటి దూకుడు లేకుండా నిరసన తెలిపారు. అయినా వారిని కొట్టారు, వేధించారు, బెదిరించారు. ఇప్పుడు వారి ఇళ్ల వద్దకు గూండాలను పంపి, క్షమాపణ చెప్పాలని ఒత్తిడి చేస్తున్నారు. ఇది పూర్తిగా అర్థరహితమైన చర్య. మేము దీనిని అంగీకరించం" అని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి, విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్యా వ్యవస్థ, పరీక్షా పత్రాల లీకేజీలకు ముగింపు, యువతకు సురక్షితమైన భవిష్యత్తు కావాలని తాము కోరుకుంటున్నట్లు తెలిపారు.

మా గళం వినిపిస్తూనే ఉంటాం: విద్యార్థులు

ఈ సమావేశంలో ముంబైలో పోలీస్ వ్యాన్‌ను అడ్డుకున్న విద్యార్థి కార్యకర్త రియా అహిర్ మాట్లాడుతూ.. "నేను ముంబైలో పోలీస్ వ్యాన్‌ను ఆపిన అమ్మాయినే. నా గురించి ఇప్పుడు రకరకాల కథనాలు ప్రచారం చేస్తున్నారు. నేను పోలీసుల విధులకు ఆటంకం కలిగించలేదు. 20 మంది విద్యార్థులను అక్రమంగా నిర్బంధించకుండా అడ్డుకున్నాను. దీనికోసం ఇప్పుడు నన్ను వేధిస్తున్నారు. జూలై 27న పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఆగస్టు 5 వచ్చినా ఇంకా ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. అయితే, నేను ఎవరికోసమైతే నిలబడ్డానో, ఆ యువత ఇప్పుడు నాకు అండగా నిలబడటం సంతోషంగా ఉంది" అని తెలిపారు.

మరో నిరసనకారిణి ఫరా నాజ్ మాట్లాడుతూ.. "జూలై 20న మేము జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. మమ్మల్ని అదుపులోకి తీసుకుని దేశద్రోహులుగా ముద్ర వేశారు. ఎవరు ఏమనుకున్నా, మా దేశం కోసం, మా హక్కుల కోసం మా గళం వినిపిస్తూనే ఉంటాం" అని ధీమా వ్యక్తం చేశారు.

# 22ఏ భూముల పేరిట ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు

**కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు**
**ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి**
**అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి**
**22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి**
**రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టమైన ఆదేశాలు**

రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి



మిగతా 3 లో

శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

### తప్పుడు ప్రచారం మానుకోండి

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



## ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన రాజకీయంగా, అభివృద్ధి పరంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉదయం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో సమావేశమైన రేవంత్ రెడ్డి... రాష్ట్రానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులకు తక్షణమే అటవీ, పర్యావరణ క్లియరెన్స్ ఇచ్చి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు కాంగ్రెస్ ఎంపీలు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం, సీఎం జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ కానున్నారు. గోదావరి-కృష్ణా నదీ జలాల పంపిణీ, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించనున్నారు.కేంద్ర మంత్రులతో వరుస సమావేశాల అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠాన పెద్దలతో భేటీ కానున్నట్లు సమాచారం. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రివర్గ కూర్పును విజయవంతంగా కొలిక్కి తెచ్చిన హైకమాండ్, ఇప్పుడు తెలంగాణలో కూడా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణపై దృష్టి సారించింది.

రాజీనామా బెదిరింపులకు వెనక్కి తగ్గకుండా కర్ణాటకలో ప్రయోగించిన 'కఠిన వైఖరి' ఫార్ములానే తెలంగాణలోనూ వర్తింపజేసి, మంత్రిపదవుల ఆశావహుల అసంతృప్తులకు చెక్ పెట్టాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది. ఈ భేటీ తర్వాత తెలంగాణ కేబినెట్ విస్తరణపై ఏఐసీసీ నుంచి కీలక ప్రకటన వెలువడే అవకాశాలు ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్



వార్తా 2 లో

ప్రజాబలం

6 ఆగస్ట్ 2026 గురువారం

# గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది.సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ.84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది.ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ.43,200 కోట్లు కేటాయించారు.ఒక్కో బావికి గరిష్ఠంగా రూ.650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ.28,534 కోట్లు వెచ్చించనున్నారు.సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు.అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ.2,000 కోట్లు కేటాయించారు.లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి.చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది.చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది.'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది.ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది.అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది.ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హోర్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి.సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది.

# సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం: హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్

**విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లతో 'సైబర్ జాగరూకత దివాస్' అవగాహన సదస్సు**

**అధికారులతో కలిసి 'సురక్ష కా తిరంగా' పోస్టర్ ఆవిష్కరణ**

కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్ల చేతిలో పెట్టి మోసపోవద్దని, విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ హెచ్చరించారు. 'సైబర్ జాగరూకత దివాస్' పురస్కరించుకుని సిటీ సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో బుధవారం విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీ సజ్జనర్.. ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీలు రతన్, మాలకొండయ్య, విశ్రాంత ఈఎన్సీ కరీంలతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించే 'సురక్ష కా తిరంగా' పోస్టర్‌ను ఆవిష్కరించారు.




సదస్సులో సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. సాంకేతికత పెరిగేకొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాన్ని సంతరించుకుంటున్నాయని తెలిపారు. నగరంలో ఒక ఏడాది కాలంలో దొంగతనాలు, దోపిడీల వంటి సంప్రదాయ నేరాల వల్ల రూ.30 కోట్ల నష్టం వాటిల్లితే.. ఒక్క సైబర్ నేరాల రూపంలోనే బాధితులు ఏకంగా రూ.400 కోట్లకు పైగా కోల్పోతున్నారని తెలిపారు. అంటే సగటున రోజుకు రూ.కోటికి పైగా ప్రజల సొమ్ము కేటుగాళ్ల ఖాతాల్లోకి మళ్లుతోందన్నారు. విశ్రాంత ఉద్యోగుల డిజిటల్, భౌతిక భద్రతకు నగర పోలీసులు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు.

సీనియర్ సిటిజన్లను డిజిటల్ అరెస్టులు, పింఛను సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలకు గురిచేస్తున్నారని వివరించారు. సీబీఐ, ఈడీ, ఆర్‌బీఐ లేదా పోలీసు అధికారులమని చెప్పి డిజిటల్ అరెస్ట్ పేరిట బెదిరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దన్నారు. మన చట్టాల్లో గానీ, పోలీసు వ్యవస్థలో గానీ 'డిజిటల్ అరెస్ట్' అనే విధానమే లేదని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తుల నుంచి అలాంటి ఫోన్ కాల్స్ రాగానే భయపడకుండా వెంటనే కట్ చేయాలని సూచించారు. వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూప్‌ల ద్వారా వచ్చే ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలు, ట్రేడింగ్ లింక్‌లను చూసి మోసపోవద్దన్నారు. షేర్ ట్రేడింగ్ ను సెబీ ఆమోదించిన రిజిస్టర్డ్ బ్రోకర్లు, అధీకృత డీమ్యాట్ ఖాతాల ద్వారానే చేయాలని చెప్పారు.

ఇంట్లోని పిల్లలు ఫోన్‌లు తీసుకుని ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లలో సభ్యత్వం తీసుకోవడం వల్ల కూడా పెద్దల రిటైర్‌మెంట్ సొమ్ము మాయమవుతుందంటూ కొన్ని ఘటనలను గుర్తుచేశారు. బ్యాంకింగ్ వివరాలు, పిన్ నంబర్లు, ఓటీపీలను కుటుంబ సభ్యులతో సహా ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ఒకవేళ అజాగ్రత్త వల్ల సైబర్ మోసానికి గురైతే, తక్షణమే స్పందించి గోల్డెన్ అవర్ లో 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే సమాచారం ఇస్తే బాధితుల సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు.

అనంతరం మాజీ డీజీపీ ఎమ్. రతన్ మాట్లాడుతూ.. సైబర్ మోసాల బారిన పడకుండా ఉండేందుకు తన ఖాతా నుంచి రూ. 5,000 కంటే ఎక్కువ మొత్తానికి చెక్కులు వచ్చినా, విత్‌డ్రాయల్స్ ఉన్నా తన ముందస్తు అనుమతి లేనిదే క్లియర్ చేయవద్దని బ్యాంకులకు స్వయంగా సూచించినట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా ఓటీపీలను ఇతరులతో ఎట్టిపరిస్థితుల్లోనూ పంచుకోవద్దని ఆయన హెచ్చరించారు. సీనియర్ సిటిజన్లు తమ ఫోన్‌లను పిల్లల చేతికి ఇచ్చేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలు తెలియక ఏదైనా బటన్ లేదా సందేహాస్పద లింక్‌ను నొక్కడం వల్ల బ్యాంకు ఖాతాల్లోని సొమ్ము క్షణాల్లో ఖాళీ అయ్యే ప్రమాదం ఉందన్నారు.

మరొక అతిథి, మాజీ డీజీపీ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ.. సైబర్ నేరం జరిగిన తర్వాత బాధితులు ఎంత ఆవేదన పడినా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినా పోగొట్టుకున్న డబ్బును తిరిగి సాధించడం చాలా కష్టమని పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల నష్టంతో పోలిస్తే రికవరీ అయ్యే మొత్తం అత్యంత స్వల్పం కాబట్టి, ముందస్తు జాగ్రత్తలు పాటించడమే సైబర్ నేరాలకు ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు. అవగాహన లోపం వల్ల సీనియర్ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, ఉన్నత విద్యావంతులు సైతం కేటుగాళ్ల బురిడీ మాటలకు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారీ డిజిటల్ లావాదేవీల కోసం ప్రధానమైన పొదుపు ఖాతాను వాడకుండా, తక్కువ మొత్తం ఉండేలా మరో ప్రత్యేక బ్యాంక్ ఖాతాను తెరిచి దాన్ని మాత్రమే ఉపయోగించాలని సలహా ఇచ్చారు.

అదనపు సీపీ (క్రైమ్స్) ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త పద్ధతితో ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని, అపరిచిత ఫోన్ కాల్స్, మెసేజ్‌ల పట్ల పౌరులు ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండాలన్నారు. నగరంలో సైబర్ నేరాల నియంత్రణకు, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు క్రైమ్ విభాగం నిరంతరం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఒకవేళ సైబర్ మోసం జరిగితే బాధితులు స్వల్ప సమయంలోనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే త్వరితగతిన స్పందించేందుకు వీలవుతుందని చెప్పారు. మోసం జరిగిన వెంటనే సమాచారం అందిస్తే నేరస్థుల బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసి, బాధితుల సొమ్మును రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేశారు.

ఈ అవగాహన సదస్సులో ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ చైర్మన్ రమణా నాయక్, కార్యదర్శి రమేష్ మిత్రి, డీసీపీలు శ్రీమతి శిల్పవల్లి, ఐపీఎస్, రమణారెడ్డి, రాజేశ్, నగర సైబర్ క్రైమ్ విభాగ ఏసీపీ శివమారుతి, అధికారులతో పాటు పెద్ద సంఖ్యలో విశ్రాంత అధికారులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

# రక్షణ రంగంలో హైదరాబాద్ వర్సిటీ అద్భుత ఆవిష్కరణ.. 'హైదరాసీన్'కు భారత పేటెంట్!

**రాకెట్ ఇంధనం కోసం హైదరాబాద్ వర్సిటీ సరికొత్త ఆవిష్కరణ 'హైదరాసీన్'**

**రక్షణ, అంతరిక్ష రంగాల్లో కీలకమైన ఈ ఆవిష్కరణకు భారత పేటెంట్**

**దిగుమతి చేసుకునే పదార్థానికి ప్రత్యామ్నాయంగా దేశీయంగా రూపకల్పన**

**తక్కువ ఖర్చుతో పాటు మెరుగైన పనితీరు దీని ప్రత్యేకత**

**ఆత్మనిర్భర్ భారత్ దిశగా కీలక ముందడుగుగా అభివర్ణన**




భారత రక్షణ, అంతరిక్ష రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) కీలక ముందడుగు వేసింది. రాకెట్లు, క్షిపణులలో ఉపయోగించే ఘన ఇంధనం (సాలిడ్ రాకెట్ ప్రొపెల్లెంట్) కోసం 'హైదరాసీన్' (HYDER-ACENE) అనే సరికొత్త పాలిమర్ ఆధారిత పదార్థాన్ని విజయవంతంగా అభివృద్ధి చేసింది. ఈ ఆవిష్కరణకు భారత ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా లభించింది. ఇది దేశీయంగా రక్షణ, అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది.

హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీకి చెందిన పరిశోధకుడు ముత్యాలనాయుడు గనివాడ, ప్రొఫెసర్ సౌరవ్ జానా, ప్రొఫెసర్ తుషార్ జానా బృందం ఈ నూతన పదార్థాన్ని అభివృద్ధి చేసింది. దశాబ్ద కాలంగా బర్న్-రేట్ కేటలిస్ట్‌లపై చేస్తున్న పరిశోధనల ఫలితంగా, సుమారు నాలుగేళ్ల కృషితో ఈ 'హైదరాసీన్' రూపుదిద్దుకుంది. ఈ ఆవిష్కరణకు గాను జూలై 21న భారత పేటెంట్ కార్యాలయం నుంచి పేటెంట్ (నం. 596319) మంజూరైంది.

దిగుమతికి ప్రత్యామ్నాయంగా..

ప్రస్తుతం రాకెట్ ఇంధనం కోసం వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న 'బ్యూటాసీన్' అనే పదార్థాన్ని భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. దీనికి పూర్తిస్థాయి దేశీయ ప్రత్యామ్నాయంగా 'హైదరాసీన్'ను రూపొందించారు. సంప్రదాయ పద్ధతుల్లో ఇంధనాన్ని మండించడానికి బైండర్ (బంధకం), బర్న్-రేట్ కేటలిస్ట్ (దహన రేటును నియంత్రించే ఉత్ప్రేరకం) అనే రెండు వేర్వేరు పదార్థాలను వాడతారు. అయితే, 'హైదరాసీన్'లో ఈ రెండు లక్షణాలను ఒకే పాలిమర్ అణువులో మిళితం చేశారు. దీనివల్ల ఇంధనం మరింత స్థిరంగా, నియంత్రిత పద్ధతిలో, సమర్థవంతంగా మండుతుంది.

దిగుమతి చేసుకునే బ్యూటాసీన్ ధర కిలోకు సుమారు రూ.50,000 నుంచి రూ60,000 వరకు ఉంటుంది. దీనితో పోలిస్తే 'హైదరాసీన్' చాలా తక్కువ ఖర్చుతో తయారవుతుందని, పనితీరులో సమానంగా లేదా అంతకంటే మెరుగ్గా ఉందని పరిశోధకులు తెలిపారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి ఊతమివ్వడమే కాకుండా, దేశ వ్యూహాత్మక అవసరాలకు కీలకమైన పదార్థాల దిగుమతి భారాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. నగరానికి గుర్తుగా ఈ ఆవిష్కరణకు 'హైదరాసీన్' అని పేరు పెట్టినట్లు ప్రొఫెసర్ తుషార్ జానా వివరించారు. తదుపరి దశలో ఈ టెక్నాలజీని డీఆర్‌డీఓ, ఇస్రో వంటి సంస్థలకు బదిలీ చేసి, వాణిజ్యపరంగా భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు.

# డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలతో బద్దిపోచమ్మ బోనాల సందడి



వేములవాడ, ఆగస్టు 5 (ప్రజాబలం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామదేవత, శీతలదేవత అయిన శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోగా, ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి.మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం శ్రీ భీమేశ్వర స్వామివారికి కోడె మొక్కులు సమర్పించి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం యూనియన్ కార్యాలయంలో బోనాలకు పూజలు నిర్వహించి, ఉప్పుగడ్డ హనుమాన్ ఆలయం నుంచి శ్రీ బద్దిపోచమ్మ ఆలయం వరకు డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, సంప్రదాయ నృత్యాల నడుమ భారీ బోనాల ఊరేగింపును నిర్వహించారు. భక్తుల జైజైధ్వానాలతో ఊరేగింపు ఉత్సాహభరితంగా సాగింది.



ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఉద్యోగులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం కప్పి సత్కరించగా, ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

బోనాల సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో సుందరంగా అలంకరించి, కల్లు, బెల్లం, శాకం తదితర సంప్రదాయ నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీమతి ఎల్. రమాదేవి స్వయంగా బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించడం విశేష ఆకర్షణగా నిలిచింది. పోతురాజుల ఆధ్వర్యంలో సాగిన బోనాల ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ మహోత్సవంలో సిక్స్–ఏ టెంపుల్ యూనియన్ నాయకులు, బీఎస్‌జీవో నాయకులు, ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, వేద పండితులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# 22ఏ భూముల పేరిట ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదు



మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.

బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్?మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములను కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.

22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు.

ప్రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు.

22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు ? ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు

# ఎస్ఐఆర్‌కు మరో ఐదు రోజులే గడువు.. ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి::ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి మరో ఐదు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందని, జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు ఆగస్టు 10లోపు ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి అర్హుడైన ఓటరు భాగస్వామి కావాలని, ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే తమ పరిధిలోని బీఎల్ఓను సంప్రదించి పూర్తి వివరాలతో ఫారాలను సమర్పించాలని కోరారు. అసంపూర్ణంగా లేదా తప్పుగా నింపిన ఫారాల వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, అన్ని వివరాలను సరిచూసుకుని సమర్పించాలని సూచించారు.

ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు కూడా తమ పేరు, చిరునామా, వయస్సు, లింగం తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని తెలిపారు. ఏవైనా తప్పులు ఉంటే ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) లేదా బీఎల్ఓలను సంప్రదించి గడువులోపు సవరణలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఫారాల స్వీకరణ, సందేహాల నివృత్తి, సవరణల ప్రక్రియను నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా భారత ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక మార్గదర్శకాలను మాత్రమే అనుసరించాలని సూచించిన కలెక్టర్, చివరి నిమిషంలో రద్దీని నివారించేందుకు వీలైనంత త్వరగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలని విజ్ఞప్తి చేశారు.

"ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. అందరూ తమ వివరాలను పరిశీలించి, అవసరమైతే సవరణలు చేయించుకోవడంతో పాటు ఇప్పటివరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు ఆగస్టు 10లోపు తప్పనిసరిగా సమర్పించాలి. ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

# జవహర్ నవోదయ విద్యాలయంలో నవోదయ ఫౌండేషన్ డే వేడుకల్లో పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.జానకి,




మహబూబ్‌నగర్ పట్టణంలోని బండమీది పల్లిలో గల జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన నవోదయ ఫౌండేషన్ డే వేడుకలకు జిల్లా ఎస్పీ డి.జానకి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, దేశానికి ఉత్తమ పౌరులను తీర్చి దిద్దుతున్నాయని అన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవరచుకుని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం జిల్లా ఎస్పీ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, లక్ష్యాలు, భవిష్యత్ ఆశయాల గురించి తెలుసుకుని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# క్రీడారంగంలో కొత్త అధ్యాయం.. కోస్తాంధ్రకు గర్వకారణం

విశాఖపట్టణం, ఆగస్టు 5 తెలుగు నేల ఇచ్చిన అపూర్వ క్రీడారత్నం పీవీ సింధు తన జీవితకాల స్వప్నాన్ని సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. సాగర తీర నగరం విశాఖపట్నం వేదికగా అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న 'పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' అకాడమీ శంకుస్థాపన మహోత్సవం ఘనంగా జరిగింది. పి.వి. సింధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ బృహత్తర ప్రాజెక్టు ద్వారా భావి తరాల క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.ర నగరం విశాఖపట్నం క్రీడా రంగంలో మరో కీలక ముందడుగు పడింది. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఏర్పాటు చేస్తున్న 'సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్' నిర్మాణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శంకుస్థాపన చేశారు. అరిలోవ సమీపంలోని తోటగరువులో ఈ అకాడమీని నిర్మించనున్నారు.ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి లోకేశ్‌కు పీవీ సింధు, ఆమె కుటుంబ సభ్యులు, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం, పీవీ సింధు, క్రీడాశాఖ మంత్రితో కలిసి లోకేశ్ శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి, నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు.అనంతరం అకాడమీ భవన నమూనాను, క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురానున్న అత్యాధునిక సౌకర్యాలను మంత్రి లోకేశ్ ఆసక్తిగా పరిశీలించారు. అకాడమీ లక్ష్యాలు, వసతుల గురించి సింధును అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాజెక్టుపై రూపొందించిన ప్రత్యేక ఆడియో విజువల్ (ఏవీ) ప్రజెంటేషన్‌ను వీక్షించారు చిన్నతనం నుంచి తాను సాగించిన క్రీడా ప్రయాణం, కోచ్‌లు అందించిన ప్రోత్సాహం, ఎదురైన సవాళ్లను మనసులో ఉంచుకుని ఈ కేంద్రానికి సింధు శ్రీకారం చుట్టారు. ఈ అకాడమీ శంకుస్థాపన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశాఖలోని తోటగరువు ప్రాంతంలో " పీవీ సింధు సెంటర్ ఆఫ్ బ్యాడ్మింటన్ ఎక్సలెన్స్ అకాడమీ" కి మంత్రి నారాలోకేష్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ సింధు దంపతులతో పాటు మంత్రి రాంప్రసాద్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.ఈ ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ అకాడమీ కేవలం బ్యాడ్మింటన్ కేటాయింపులకే పరిమితం కాకుండా బహుళ క్రీడల శిక్షణా కేంద్రంగా అలరారనుంది. ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించే అధునాతన బ్యాడ్మింటన్ కోర్టులు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు హైపెర్ఫార్మెన్స్ కోచింగ్ సదుపాయాలు, ఫిట్‌నెస్ కోసం ప్రత్యేక స్ట్రెంగ్ అండ్ కండిషనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్ విభాగాలు ఏర్పాటు కానున్నాయి. క్రీడాకారులకు తక్షణ వైద్య సేవలు అందించే ఫిజియోథెరపీ యూనిట్లు, అథ్లెట్లకు అవసరమైన పౌష్టికాహార మద్దతు, రికవరీ సపోర్ట్ వంటి అత్యాధునిక వసతులను ఇక్కడ కల్పిస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే యువ క్రీడాకారుల కోసం బస సదుపాయాలు కూడా క్యాంపస్ లోపలే సిద్ధం కానున్నాయి. ప్రపంచ వేదికలపై భారత పతాకాన్ని ఎగురవేసే దిశగా ఇక్కడి క్రీడాకారులకు ఆధునిక సాంకేతికతతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు.ఈ అకాడమీ స్థాపన వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అద్భుతమైన క్రీడా ప్రతిభను వెలికితీయడమే. ఆర్థిక స్థోమత లేక, సరైన శిక్షణ లభించక వెనుకబడిపోతున్న ప్రతిభావంతులైన చిన్నారులను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాలని సింధు సంకల్పించారు. క్రీడా రంగంలో స్థిరపడాలనుకునే యువతకు అన్ని రకాల వసతులు ఒకే చోట లభించేలా ఈ క్యాంపస్ రూపుదిద్దుకుంటోంది. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన క్రీడా కేంద్రాల్లో ఒకటిగా దీనిని తీర్చిదిద్దేందుకు సింధు బృందం శ్రమిస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించడమే కాకుండా, క్రీడలను ఒక కెరీర్‌గా ఎంచుకునేలా నూతన తరాన్ని ప్రేరేపించడం ఈ కేంద్రం ప్రధాన ధ్యేయం.

# తప్పుడు ప్రచారం మానుకోండి

**కట్టు కథ లతో బట్ట కాల్చి మీద వేయ డ మే హరీష్ రావు పని**
**తొలుత కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పు**
**ఏపీ కి అమ్ముడుపోయి విమర్శలు**
**నెలాఖరులో సమ్మక్క సాగర్ కు noc**
**నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

. హైదరాబాద్, ఆగస్టు 5 : 12 ఏళ్లుగా ఏపీ ప్రభుత్వం ప్రతి బోర్డు సమావేశాల్లో తెలంగాణ ప్రాజెక్టు లను వ్యతిరేకిస్తుందని, ఇది కొత్త విషయం కాదని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఏపీ ప్రాజెక్ట్ లకు పరోక్షంగా మద్దతు ఇచ్చిన brs పార్టీ నేతలు అధికారం కోల్పోగానే కడుపు మంట తో బట్ట కాల్చి మీద వేస్తున్నారని మంత్రి విరుచుకు పడ్డారు. తెలంగాణ రైతాంగం ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో బీఆర్ ఎస్ ఏ రోజు తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేదు. బీఆర్ ఎస్ అధికారం లో ఉన్న సమయంలో నే రాయల సీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగింది వాస్తవం కాదా..? పోలవరం-బనకచర్ల ప్రాజెక్ట్ పనులు ప్రారంభం అయింది బిఆర్ ఎస్ హయాంలో కాదా అని ప్రశ్నిచ్చారు. పట్టి సీమ ఎత్తిపోతల పథకం మీ రు అధికారంలో ఉండగా పూర్తి కాలేదా అని ప్రశ్నించారు. తొమ్మిదినారేళ్ళు తెలంగాణ సొమ్ము ను లూటీ చేసి... అధికారం కోల్పోగానే మొసలి కన్నీరు కారుస్తూ న్నారు అని మండిపడ్డారు.

ఈ నెల 18 వ తేదీన జరిగే

18 GRMB మీటింగ్లో అజెండా లో చేర్చ బడిన అంశాలు కొత్తవేమి కాదు. ఇవే అంశాలను మునపటి మీటింగులలో మరియు కరెస్పాండన్స్ లలో కూడా ఆఫ్రా ప్రతి సారి ప్రస్తావిస్తూ వస్తున్నది. ఇవే అంశాలు సీతారామ ఎత్తిపోతల పథకం క్లియరెన్స్ విషయం లో కూడా ఆఫ్రా ప్రస్తావించింది. దీని పైన ఈ ప్రభుత్వం ధీటుగా స్పందించి అవన్నియు కూడా నిరాధారమైనవని GRMB కి మరియు జఔజ కి దృష్టికి తీసుకువెళ్లి SSMP - SRLIP TAC క్లియరెన్స్ (158 మీటింగ్ తేదీ : 24.04.2025) విజయవంతంగా అనుమతులు సాధించింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఆఫ్రా రాష్ట్రం నిరంతరం GRMB, జఔజ మరియు జలశక్తి మంత్రిత్వ శాఖకు కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకా-కొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టుల అనుమతులు ఇవ్వరాదని కోరుతూ వచ్చింది. వీశీజీూ ద్వారా TAC క్లియరెన్స్ పొందిన తరువాత కూడా సమీక్షించాలని ఆఫ్రా ప్రతి మీటింగ్ నందు ప్రస్తావిస్తున్నది.

ఈ సందర్భంలో చెప్పదగ్గ విషయం ఏమిటంటే, AP లేవనెత్తిన అటువంటి అంశాలను ఈ ప్రభుత్వం ధీటుగా ప్రతిఘటించి మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడడంలో సఫలీకృతుమైనది.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభత్వం ఎటువంటి ఉదాసీనత ప్రదర్శించుట లేదు. ఈ సందర్భంగా ప్రస్తావంచడం ఏమిటి అనగా గత BRS ప్రభుత్వమే 3e GRMB మీటింగ్ నందు రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి, ఆయా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాలి లేదా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి అని తన వైఖరి ద్వార స్పష్టం చేసింది. ఈ రెండు రాష్ట్రాలకు నీటి సరఫరా నియంత్రణను GRMB ప్రారంభించే ముందే ఈ షరతులలో ఏదో ఒకటి నెరవేరాలని ఆ ప్రభుత్వం పేర్కొంది.

ఇదే విషయాన్నీ పునర్ఘటిస్తూ, గత BRS ప్రభుత్వం 2nd APEX కౌన్సిల్ మీటింగ్లో (06.10.2020) ట్రిబ్యునల్ ఏర్పాటు కొరకు ఆఫ్రా రాష్ట్రం తో పోటీ పడి కోరడం జరిగింది.

ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తి తో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుందన్నారు.

ఇది ఈ ప్రభుత్వం యొక్క నిబద్ధత.

అంతర్రాష్ట్ర వ్యవహారాల (ISM) డైరెక్టరేట్ క్లియరెన్స్ మరియు IP క్లియరెన్స్ పొందడంలో గత ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయలేదు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముంపు సమస్యకు సంబంధించి కూడా గత ప్రభుత్వం ఆ రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదు.

ప్రస్తుత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని చాలాసార్లు సంప్రదించి / సందర్శించి, ISM డైరెక్టరేట్ క్లియరెన్స్ పొందడం కోసం ముంపు సమస్యకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుండి నిరభ్యంతర పత్రం (NOC) పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అశీష కోసం మూడుసార్లు ఛత్తీష్ గఢ్ సీఎం ను కలిసి noc కోసం విజ్ఞప్తి చేశాం. నెలాఖరులో అశీష ఇస్తామని సీఎం చెప్పారు. మీరు అధికారం లో ఉండగా ఒక్క సారి అయినా ఛత్తీష్ గఢ సీఎం ను కలిశారా అని ప్రశ్నించారు.

ఈ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభ్యంతరాలను సమర్థవంతంగా ప్రతిఘటించి రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్ట మొదటి బహులార్ధా సాధ క సీతమ్మ సాగర్ - సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు ాూజ అనుమతులు 24.04.2025 సాధించింది. తొమ్మిదినారేళ్లలో చేయలేని పని చేసాం. 60 టీఎంసీ ల నీటి కేటాయింపులు సాధించాం .

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా ట్రిబ్యునల్ ఏర్పరిచే విషయంలో కూడా ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తి తో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుంది .

ఇది ఈ ప్రభుత్వం యొక్క నిబద్ధత.

PBLP ప్రతిపాదన గురించి తెలిసిన తర్వాత ఈ ప్రభుత్వం వెనువెంటనే స్పందించడం జరిగింది.

ఇప్పటివరకు ముఖ్యమంత్రి రెండు సార్లు నీటిపారుదల శాఖ మంత్రి గా నేను ఏడు సార్లు , పది సార్లు ప్రధాన కార్యదర్శి , ENC(G) 19 సార్లు వంటి వివిధ స్థాయిల అధికారుల ద్వారా MoF, MoJS, MoEF&CC, CWC, GRMB, KRMB మరియు ాూాలతో సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరపబడ్డాయి.

న్యాయపరమైన చర్యలో భాగంగా, ప్రభుత్వం గౌరవనీయ సుప్రీమ్ కోర్ట్ ముందు ఒరిజినల్ సూట్ మరియు IA వాజ్యాలు వేయడం జరిగింది.

ప్రతివాదులందరూ 4 వారాల్లోగా తమ సమాధానాలను దాఖలు చేయాలని గౌరవనీయ న్యాయస్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.

2018-2022 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతానికి 200 టీఎంసీల వరద నీటిని తరలించే పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టినప్పటికీ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితం కాలేదా? అని నిలదీశారు .

ఆర్డీఎస్ లో వాటా మేరకు నీళ్ల కోసం ఏ రోజు బీఆర్ ఎస్ ప్రయత్నం చేయలేదు. ఆర్డీఎస్ ఆధునీకరణ విషయం లో ఏపీ, కర్ణాటక సీఎం లను ఒప్పించాం. మీరు ఏ రోజైనా కర్ణాటక సీఎం ను కలిసి ఒప్పించారా అని నిల దీ శారు.

ఎిఎస్ లో కృష్ణా జలాల వాటా కోసం స్వయంగా విచారణ కు హాజరై న్యాయ నిపుణులతో సూచన చేశా.

గత ప్రభుత్వం కంటే సమర్థ వంతంగా వాదనలు వినిపిస్తున్నాం.

రాష్ట్ర ప్రజల నీటి హక్కులను పరిరక్షించి, కాపాడేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది.

బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అనే సిద్ధాంతం కలిగిన ఎతీం ద్వంద విధానాలతో మేము నేర్చుకోవాల్సి సింది ఏమీ లేదు.

తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లో ఏపీ కాంట్రాక్టర్ లనుంచి ముడుపులు అందాయనే కవిత ఆరోపణ లకు జవాబు చెప్పు. అ ముడుపుల్లో నీ వాటా ఎంత.

తెలంగాణ లో అధికారం లో రావడం లేదని ఏపీ తో కుమ్మక్కై నాగార్జున సాగర్ ప్రాజెక్టు ను వివాదం చేసింది మీరు కాదా.?

రూ లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ను నిండా ముంచి సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తా వా అని మంత్రి నిలదీశారు

# దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

గుంటూరు, ఆగస్టు 5 దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి . అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది.ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి.ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి.దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది.పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ?గుంటూరు?తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ?అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35?38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ?ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది.ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్-టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది.ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు?కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. “అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది. గోదావరి డెల్టా నుంచి కృష్ణా, గుంటూరు, నెల్లూరు వరకు అభివృద్ధి ప్రవాహం ఒక దిశలో సాగుతుండగా, మధ్యలో ఉమ్మడి ప్రకాశం జిల్లా మాత్రం మరో ప్రశ్నను మన ముందుంచుతోంది. సహజ వనరులు ఉన్నా, విస్తారమైన భాగం ఉన్నా, ఎందుకు అదే స్థాయి అభివృద్ధి అక్కడ కనిపించలేదు? ఇదే ఇప్పుడు పరిశీలించాల్సిన తదుపరి అధ్యాయం.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

విజయవాడ, ఆగస్టు 5 ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిల్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి.ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్-డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది. సరైన క్రిమినల్ రక్షణ ప్రణాళికలు లేకుండా, అధిష్ఠానం ఇచ్చే రాజకీయ హామీలను మాత్రమే నమ్ముకుని క్షేత్రస్థాయిలో దూకుడు ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జ్‌లు చివరకు న్యాయపరమైన సంక్షోభంలో మునిగిపోతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా ఆ పార్టీలో వినిపిస్తోంది.

# 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

ఏలూరు, ఆగస్టు 5 ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది.

ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి.ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

# బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష

గుంటూరు, ఆగస్టు 5 తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, వైసీపీ అభిమానిగా చెప్పుకుంటున్న బోరుగడ్డ ఆకస్మికంగా నిరసనకు దిగడంతో తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద కలకలం చెలరేగింది. అంతేకాకుండా పార్టీలో జగన్ తర్వాత ఎక్కువ ప్రాధాన్యం ఉండే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జలపై అత్యంత తీవ్ర వ్యాఖ్యలతో బోరుగడ్డ విమర్శలు గుప్పించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నడూలేని విధంగా బోరుగడ్డ ఇలా ఆందోళనకు దిగడం వెనుక కారణాలు ఏంటి అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. వైసీపీ అధికారంలో ఉండగా, ఆ పార్టీ సానుభూతిపరుడిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో బోరుగడ్డ చేసిన వ్యాఖ్యలు, ప్రత్యర్థులపై దారుణ దూషణలతో వైసీపీకి తీవ్ర నష్టం జరిగిందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బోరుగడ్డపై రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదు కావడం, 9 నెలలు జైలులో ఉండటం తెలిసిందే. ఆ తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ వస్తున్న బోరుగడ్డ ఇప్పుడు యూటర్న్ తీసుకున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. వైసీపీలో తనకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన ఆందోళన చేయడం వెనుక పార్టీపై అసంతృప్తా లేక పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డి వైఖరికి నిరసన అనేది తెలియాల్సివుందని అంటున్నారు

# 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

నెల్లూరు, ఆగస్టు 5 వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముంపు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారుగ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడానికి గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది.రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం వెట 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీటి సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి. దాదాపు 5,000 హెక్టార్లలో తాటి వనాల ఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి" అని పవన్ కళ్యాణ్ తెలిపారు

# మళ్లీ తెరపైకి కావేరి అంశం...

బెంగళూరు, ఆగస్టు 5, (న్యూస్ పల్స్)ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాలు నాటిది. ఇంతవరకు పరిష్కార మార్గం దొరకలేదు. పరిష్కరించే బాధ్యత ఎవరూ తీసుకోలేదు.. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చేసుకున్నారు.అందువల్లే ఈ సమస్య మళ్లీ రిపీట్ అయింది. ఈసారి రాచ పుండు మాదిరిగా ఇబ్బంది పెడుతోంది. రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బంది కరమైన వాతావరణానికి కారణమవుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో ప్రముఖమైనవి తమిళనాడు, కర్ణాటక. ఈ రెండు రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వివాదం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది.ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో కూడా కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ తో విజయ్ ప్రభుత్వానికి కొనసాగిస్తున్నారు. కావేరి జలాల వివాదం నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ వివాదం కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారిపోయింది. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీకి సపోర్ట్ చేస్తోంది. రెండు రాష్ట్రాలలో నాయకులకు బలమైన సెంటిమెంట్లను కాంగ్రెస్ పార్టీకి ఏం చేయాలో అర్థం కావడం లేదు . ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా సరే కాంగ్రెస్ పార్టీ దుకాణం సర్దుకోవాల్సిందే .ఇటీవల రివర్ రెగ్యులేషన్ కమిటీ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి రోజు 3500 క్యూసెక్కుల కావేరి నది నీటిని విడుదల చేయాలి. ఈ ఆదేశాలు రావడమే ఆలస్యం కర్ణాటకలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వర్షాలు లేకపోవడంతో సరిగ్గా నీటి నిల్వలేదని.. ఇలాంటి సమయంలో నీరు విడుదల చేయడం కష్టమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే క్లారిటీ ఇచ్చారు. అయితే పరిస్థితి చేయి దాటిపోతున్న నేపథ్యంలో నేరుగా కర్ణాటక వచ్చి శివకుమార్ తో మాట్లాడాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించారు. అయితే కర్ణాటక రాష్ట్రంలో అక్కడి ప్రజలు.. ఇతర సంఘాల నుంచి తిరుగుబాటు విపరీతంగా ఉండడంతో విజయ్ పర్యటనను రద్దు చేసుకోవాలని శివకుమార్ సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్రానికి అసలు రావద్దని శివకుమార్ విజయ్ కి సూచించారు.తమిళనాడు రాజకీయాలను కావేరి నది నీటిని వేరుగా చూడడం సాధ్యం కాదు . కావేరి నది నీటి ఆధారంగానే తమిళనాడు రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కర్ణాటక ఒత్తిడికి తలవంచితే విజయ్ కి తమిళనాడు రాష్ట్రంలో ఇబ్బందికరమైన పరిణామం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే విజయ్ ప్రభుత్వం కావేరి నది జలాల వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని భావించింది. మరోవైపు విజయ్ క్యాబినెట్ లో ఉన్న చాలామంది మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కావేరి నది నీళ్లు విడుదల చేయకపోతే.. విజయ్ తన ప్రభుత్వానికి సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన సపోర్ట్ పై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అక్కడ మీడియాలో వార్తలు వస్తున్నాయి.తమిళనాడు మంకుపట్టు వీడకపోవడం.. కర్ణాటక ప్రభుత్వం పట్టుదలతో ఉండడంతో కావేరి వివాదం కాంగ్రెస్ పార్టీకి చాలా ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి పై స్థానిక రైతులు.. బిజెపి.. జెడిఎస్ పార్టీల నుంచి ఒత్తిడి వస్తోంది. ఒకవేళ కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు కావేరి నది జలాలు విడుదల చేస్తే మాత్రం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకోపోయే ప్రమాదం ఉంది. అందువల్లే ఓటు బ్యాంకు ను కాపాడుకోవడానికి.. బిజెపి వేసిన ఉచ్చు నుంచి రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంది. దీనికి తోడు ఇటీవల శివకుమార్ ఆధ్వర్యంలో తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించిన మేకదాటు ప్రాజెక్టు ను ఏకపక్షంగా వ్యతిరేకించారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లు అధికంగా ఉంటాయి.. ఈ సెంటిమెంట్లకు రెస్పెక్ట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ పుట్టి కావేరిలో మునగడం ఖాయం

# ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర

భువనేశ్వర్, ఆగస్టు 5 నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది.నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి .ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి.ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం, అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది

# కెమికల్ లీక్ అయి ముగ్గురు కార్మికులు మృతి



బెంగళూరు కర్ణాటకలోని కడేచూరు పారిశ్రామికవాడలో ఘోర ప్రమాదం జరిగింది. సీఐఎల్ ల్యాబొరేటరీ ఫ్యాక్టరీలో కెమికల్ లీక్ అయింది. ఘటనలో ముగ్గురు కార్మికులు ఊపిరాడక మృతి చెందారు. తెలంగాణకు చెందిన గణేశ్తో పాటు మధ్యప్రదేశ్కు చెందిన విక్రమ్ సింగ్, సంజయ్ సింగ్ మృతి చెందారు. తెలంగాణకు చెందిన శివకుమార్, ఏపీకి చెందిన హేమంత్కు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. రాయచూర్ రిమ్స్ ఆస్పత్రిలో బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఫ్యాక్టరీలో భద్రతా లోపాల వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి అయింది.

# కదిరిలో ఇద్దరు కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సస్పెన్షన్



కదిరి నంబుళపూళకుంట కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు దీపా, రెహనా లను అధికారులు సస్పెండ్ చేసారు. వీరిద్దరూ విద్యార్థులతో మసాజ్ చేయించుకున్న వీడియోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. దాంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు దీపా, రెహనాలను ఉద్యోగాల నుంచి తొలగించారు.

# ఆగస్టు 11న 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ కొత్త దేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 5, బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది.బలూచ్ జాతీయవాదులు 1947 ఆగస్టు 11న కలాత్ రాజ్యం (ఆధునిక బలూచిస్తాన్‌లోని ముఖ్య భాగం) స్వతంత్రంగా ప్రకటించబడిందని చెబుతారు. బ్రిటిష్ వైదొలగడం సమయంలో కలాత్ ఖాన్‌తో స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరి, దానిని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించినట్లు కొన్ని నివేదికలు ఉన్నాయి. అయితే 1948 మార్చిలో పాకిస్తాన్ సైన్యం జోక్యం చేసుకుని కలాత్‌ను విలీనం చేసింది. బలూచ్ వైపు ఇది బలవంతపు విలీనం అని, పాకిస్తాన్ వైపు ఇది చట్టబద్ధమైన అనుసంధానం అని వాదనలు ఉన్నాయి. అయితే ఈ చారిత్రక అసంతృప్తి ఆధారంగా 1948 నుంచి అనేక తిరుగుబాటు దశలు జరిగాయి. ప్రస్తుత ఉద్యమం దాని కొనసాగింపుగా కనిపిస్తుంది.2026 జూలైలో మిర్ యార్ బలోచ్ వంటి నాయకులు "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించారు. వారు జాతీయ జెండా, గీతం, కరెన్సీ (బలోచి ఫాలస్) ప్రవేశపెట్టినట్లు, 85 శాతం భూభాగంపై నియంత్రణ ఉన్నట్లు, స్వంత పరిపాలనా వ్యవస్థ ఉన్నట్లు దావా చేశారు. ఆగస్టు 3, 2026న ఆగస్టు 11ను స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జెండా ఎగురవేసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇది 1947 చారిత్రక తేదీపై ఆధారపడి ఉంది. అయితే ఈ దావాలు స్వతంత్రంగా ధ్రువీకరించబడలేదు. ఏ దేశం లేదా అంతర్జాతీయ సంస్థ ఈ "రిపబ్లిక్"ను గుర్తించలేదు. బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్తాన్ ప్రావిన్స్‌గానే కొనసాగుతోంది.బలూచ్ వైపు ప్రధాన ఆరోపణ సహజ వనరులు (గ్యాస్, ఖనిజాలు, గ్వాదర్ పోర్ట్) స్థానికులకు ప్రయోజనం లేకుండా చైనా?పాక్ ఎకనామిక్ కారిడార్ ద్వారా బయటకు వెళు_న్నాయని, యువతపై అణచివేత, మహిళలు మాయం కావడం వంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటోంది. బీఎల్ఏ వంటి సమూహాలు ఈ కారణాలతో పోరాటం చేస్తున్నాయని చెబుతాయి. ఈ ఆరోపణలు హ్యూమన్ రైట్స్ సంస్థలు, కొన్ని అంతర్జాతీయ నివేదికలలో కూడా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఈ సమూహాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తుంది. బీఎల్ఏను కొన్ని దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి.బీఎల్ఏ, ఇతర సమూహాలు సైనిక స్థావరాలు, మౌలిక వసతులపై దాడులు చేస్తూ ఉన్నాయి. 2026లో కోఆర్డినేటెడ్ దాడులు జరిగాయి, కానీ పాకిస్తాన్ సైన్యం కౌంటర్?ఆపరేషన్లు కొనసాగిస్తోంది. ప్రావిన్స్‌పై పూర్తి నియంత్రణ బలూచ్ సమూహాల చేతుల్లో ఉందన్న దావా స్వతంత్ర మూలాల ద్వారా నిర్ధారించబడలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటికీ అధికారిక నిర్వహణలో ఉన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన చట్టపరంగా రాజకీయ వ్యక్తీకరణగా ఉండవచ్చు, కానీ ప్రభావవంతమైన ప్రభుత్వం, విదేశీ సంబంధాల సామర్థ్యం రాష్ట్రంగా నిలబడటానికి అవసరమైన అంశాలు లేవు.బలూచిస్తాన్ సమస్య చారిత్రక అసంతృప్తి, వనరుల పంపిణీ అసమానత, మానవ హక్కుల ఆరోపణలు, సాయుధ పోరాటాల మిశ్రమం. స్వయంప్రకటిత స్వాతంత్ర్యం గుర్తింపు పొందకపోయినా, ఉద్యమం కొనసాగుతోంది. శాంతియుత రాజకీయ పరిష్కారం, స్థానిక అభివృద్ధి, మానవ హక్కుల రక్షణ లేకుండా ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టం కావచ్చు. పాకిస్తాన్ ఎలా స్పందిస్తుందో, అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తుందో ఆగస్టు 11 తర్వాత స్పష్టం అవుతుంది.

# యాక్టివ్ పాలిటిక్స్ లోకి నల్లారి

హైదరాబాద్, ఆగస్టు 5, ఏపీ బీజేపీలో చాలామంది నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు బాగానే గెలిచారు. 8 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీ నుంచి విజయం సాధించారు. మరో ముగ్గురు ఎంపీలు సైతం ఉన్నారు. ఒక రాష్ట్ర మంత్రి తో పాటు కేంద్ర మంత్రి కూడా ఉన్నారు.. ఎందరు ఉన్న బిజెపి పెద్దగా సౌండ్ చేయడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి లైన్ లోకి వచ్చారు. ప్రెస్ మీట్ పెట్టి రాష్ట్రాల మధ్య జలవివాదం గురించి మాట్లాడారు. ఏపీ ప్రభుత్వానికి కీలక సూచనలు చేశారు. జలవివాదాలు విషయంలో ఎటువంటి మొహమాటలకు పోవద్దని.. పక్క రాష్ట్రాలతో చర్చలు జరిపి పరిష్కరించుకోవాలని సూచించారు. అవసరం అనుకుంటే పోరాటం చేయాలని కూడా పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సాహేతుకంగా జరగలేదని.. అప్పట్లోనే జల పంపకాలు చేపడుతూనే వివాదాలు పరిష్కరించుంటే ఇంతవరకు పరిస్థితి వచ్చి ఉండేది కాదు అని అభిప్రాయపడ్డారు కిరణ్ కుమార్ రెడ్డి.ఉమ్మడి రాష్ట్రానికి చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన హయాంలోనే రాష్ట్ర విభజన జరిగింది. దానిని తీవ్రంగా వ్యతిరేకించారు కిరణ్ కుమార్ రెడ్డి. కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేసారు. సొంతంగా సమైక్యాంధ్ర పార్టీని ఏర్పాటు చేశారు. కానీ అది అంతగా వర్కౌట్ కాలేదు. చివరకు బిజెపిలోకి వచ్చి ఆ పార్టీ తరఫున మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఉన్నట్టుండి మీడియా ముందుకు వచ్చి రాష్ట్ర విభజన సమస్యలు, జలవివాదాలు గురించి ప్రస్తావించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ప్రస్తుతం గోదావరి తో పాటు కృష్ణా జలాలకు సంబంధించి వివాదాలు నడుస్తున్నాయి. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం ఉంది. ఆపై పోలవరం ప్రాజెక్టు విషయంలో ఒడిస్సా తో పాటు చత్తీస్గడ్ తో కూడా వివాదం నడుస్తోంది. వాటన్నింటినీ పరిష్కరించుకోవాలని ఏపీ ప్రభుత్వానికి కిరణ్ కుమార్ రెడ్డి సూచించడం గమనార్హం. అవసరం అనుకుంటే కేంద్ర ప్రభుత్వంతో గట్టిగా మాట్లాడాలని సూచిస్తున్నారు కిరణ్. ఎన్నికల వరకు మాత్రమే పొత్తు కానీ.. పార్టీలు, ప్రభుత్వం వేరు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. అయితే చాలా రోజులకు కిరణ్ కుమార్ రెడ్డి ముందుకు రావడం గమనార్హం. రాష్ట్రం కోసం కీలక సూచనలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే రాజ్యసభ ఎన్నికల సమయంలో కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. కానీ వివిధ సమీకరణల్లో ఆయనకు పదవి దక్కలేదు. ఇప్పుడు ఆయన పొలిటికల్ గా యాక్టివ్ అవుతారన్న టాక్ వినిపిస్తోంది. అందులో భాగంగానే సరిహద్దు జలాల వివాదంపై మాట్లాడుతున్నారని ప్రచారం సాగుతోంది. మరి చూడాలి ఆయన పాత్ర ఎలా ఉండబోతుందో..

# మొక్కజొన్న ఆల్ టైమ్ రికార్డ్

అదిలాబాద్, ఆగస్టు 5 తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్ ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన టెండర్లలో చరిత్రలోనే తొలిసారిగా మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ-వేలం నిర్వహించగా.. టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడంపై మంత్రి తుమ్మల తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణలో రైతుల నుంచి సేకరించిన మొక్కజొన్నల విక్రయంలో మార్క్‌ఫెడ్ సరికొత్త చరిత్ర సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈ-వేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా.. మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది.గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ. 1000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి టెండర్ల ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు.మంత్రి ఆదేశాల మేరకు సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ-వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని నిర్ణయించారు. క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్నలో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఆగస్టు 1, ఆగస్టు 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈ-వేలం నిర్వహించింది. అనంతరం సోమవారం అధికారులు ఆ టెండర్లను సమగ్రంగా పరిశీలించి ఖరారు చేశారు.ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ. 26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ. 2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ. 25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ. 1,370 లాభం సమకూరింది. సరైన నిర్ణయాలు, పారదర్శక విధానాల వల్ల సంస్థకు ఈ స్థాయిలో లాభాలు రావడం పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్, ఆగస్టు 5 నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్ రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

# టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి

హైదరాబాద్, ఆగస్టు 5తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది.అధికార పార్టీ తరఫున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్ ? హైదరాబాద్ ? రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నే జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతంగా భావించే నల్గొండ ? ఖమ్మం ? వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు.కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తున్న ప్రధాన అంశం!

# ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు

హైదరాబాద్, ఆగస్టు 5 గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్-3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, మరోవైపు నగర శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్ డిపోలను అందుబాటులోకి తేనుంది. సంస్థ అవసరాలు, భవిష్యత్తు రవాణా ప్రణాళికలను దృష్టిలో ఉంచుకుని నగరంలో కొత్తగా 3 నుంచి 5 వరకు బస్ డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ముందస్తుగా ముషీరాబాద్‌లోని 5 ఎకరాల స్థలంలో హైదరాబాద్-3 డిపోను, నాగారం రోడ్డులోని 5 ఎకరాల విస్తీర్ణంలో జవహర్‌నగర్ డిపోను ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటితో పాటు గతంలో రకరకాల కారణాలతో మూతబడిన రాణిగంజ్-2 డిపోను పునరుద్ధరించి, ఆధునిక వసతులతో రీ-మోడిఫికేషన్ చేసి త్వరలోనే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 26 బస్ డిపోలు కొనసాగుతుండగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి వీటి సంఖ్యను 31కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త డిపోల ఏర్పాటుకు తగిన స్థలాలు కేటాయించాలని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ఆర్టీసీ అధికారులు కోరారు. శివారు ప్రాంతాల్లో డిపోలు అందుబాటులోకి వస్తే నగర శివార్ల ప్రజలకు ప్రజారవాణా మరింత సులభతరం కానుంది.ప్రస్తుతం గ్రేటర్ ఆర్టీసీ ప్రతినిత్యం సుమారు 2800 బస్సులను నడుపుతుండగా.. వాటిలో 493 ఎలక్ట్రిక్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం హయత్ నగర్-2 డిపో నుంచి 98, హెచ్‌సీయూ డిపో నుంచి 101, కూకట్‌పల్లి డిపో నుంచి 20, మియాపూర్-2 డిపో నుంచి 100, కంటోన్మెంట్ డిపో నుంచి 80, రాణిగంజ్ డిపో నుంచి 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను పూర్తిస్థాయి ఈవీ జోన్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 26 డిపోలలోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.నగర శివారు ప్రాంతాల్లోని ప్రతి డిపోలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాల నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చే ఎలక్ట్రిక్ బస్సులు కూడా రాత్రి వేళల్లో సమీపంలోని ఈ డిపోలలో సులువుగా ఛార్జింగ్ చేసుకొని తెల్లవారుజామున మళ్లీ జిల్లాలకు తిరుగు ప్రయాణమయ్యే వెసులుబాటు కలుగుతుంది.

# కాళేశ్వరమే అజెండా

హైదరాబాద్, ఆగస్టు 5 తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది.కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది.ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం , ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది.ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది.ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# రేవంత్ ధీమా వెనుక...

మహబూబ్ నగర్, ఆగస్టు 5, తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్టు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులై పోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగు తోంది.2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా ఆయన తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు.రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీన పరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది.దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం.కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీ య పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్మ్‌ల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలంనిర్ణయిస్తుంది.అయితేప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

హైదరాబాద్, ఆగస్టు 5 హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది.పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రిబ్యునల్‌ను కోరింది.హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది.ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్-5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్-3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.హైదర్ అలీ అనే వ్యక్తి ఎన్‌జీటీలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. క్రికెట్ మైదానాల నిర్వహణ కోసం భూగర్భ జలాలను వినియోగిస్తున్నారని, బదులుగా శుద్ధి చేసిన నీరు లేదా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వంటి ప్రత్యామ్నాయాలను ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ఐపీఎల్ వంటి వాణిజ్య టోర్నీల సమయంలో కూడా భారీగా నీరు వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు.ఈ కేసులో 2021 నుంచే ఎన్‌జీటీ విచారణ కొనసాగుతోంది. పలు మార్లు ఆదేశాలు ఇచ్చినా హెచ్‌సీఏ సమయానికి స్టేటస్ రిపోర్ట్ సమర్పించకపోవడంతో ఈ ఏడాది జనవరిలో ట్రిబ్యునల్ రూ.5 వేల జరిమానా విధించింది. అనంతరం హెచ్‌సీఏ జరిమానా చెల్లించి, సాంకేతిక వివరాలు సేకరించడం, నిపుణుల సలహాలు తీసుకోవడం వల్లే ఆలస్యమైందని వివరణ ఇచ్చింది

# తెలంగాణకు ప్రాజెక్టులు ఇచ్చినా.. కనిపించనా ఫలితం

హైదరాబాద్, ఆగస్టు 5 ఏపీలోని విజయనగరం జిల్లాలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ అదే వేదిక నుంచి మరిన్ని ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోని ఖమ్మం, దేవరపల్లి ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి.అ యితే.. వీటిని ప్రస్తావిస్తూ.. తెలంగాణ బీజేపీ నాయకులు ఎక్కడా ప్రకటన చేయకపోవడం.. కనీసంకార్యక్రమాన్ని కూడా నిర్వహించకపోవడం గమనార్హం. నిజానికి ఏపీలో ప్రారంభించిన పలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందినవి.. అనుబంధంగాఉన్న ప్రాజెక్టులు కొన్ని ఉన్నాయి. కానీ, ఆ తరహా జోష్ తెలంగాణలో కనిపించకపోవడం గమనార్హంమోడీ ప్రారంభించిన వాటిలో.. కీలకమైన తెలంగాణ ప్రాజెక్టుల విషయానికి వస్తే.. ఖమ్మం-దేవరపల్లి మధ్య ప్రధాన ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం కోసం.. కొన్నేళ్లుగా ఇక్కడివారు ఎదురు చూస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రభుత్వం కూడా విజ్ఞాపనలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే 'ఖమ్మం -దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ పోర్ లేన్స్ ఎక్స్‌ప్రెస్‌వే'ను కేంద్రం మంజూరు చేసింది. దీనిని తాజాగా ప్రధాని ప్రారంభించారు. అలాగే ఖమ్మం -దేవరపల్లి ప్యాకేజీలో భాగంగా.. ఎక్స్ ప్రెస్ వే పక్కన గ్రామీణ రహదారులను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు.. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన.. ఫ్యూచర్ సిటీతోనూ అనుసంధానం చేయనున్నారు. మరి ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రారంభించిన సమయంలో తెలంగాణలో ఒక్క కార్యక్రమాన్ని కూడా బీజేపీ నాయకులు ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. ఇక, ఏపీలో నిర్మించిన.. అనంతపురం, కర్నూలు సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్ మిషన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. అయితే.. ఈరెండు జోన్ల ద్వారా.. కేవలం ఏపీలోని అనంతపురం,కర్నూలు ప్రాంతాలకే కాకుండా.. తెలంగాణలోని అనుబంధ జిల్లాలకు కూడా సౌర విద్యుత్‌ను అందించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీజేపీలో ఎక్కడా చలనం లేకపోవడం గమనార్హం.

# మావోయిస్టులపై విరుచుకుపడ్డ పోలీసులు

రాయ్ పూర్ జాయింట్ ఆపరేషన్లతో ఛత్తీస్‌గఢ్లో మావోయిస్ట్ వ్యతిరేక పోరాటంలో భద్రతా దళాలు సాధించిన విజయాలు ఫలించాయి. కోటి రూపాయలకు పైగా రివార్డు ఉన్న అగ్రనేత మిసిర్ బేస్రా అరెస్టుతో పాటు అనేక మంది కీలక కేడర్లు లొంగిపోవడం దళాలకు పెద్ద ఊరటనిచ్చింది. 2026 లో ఇప్పటివరకు 93 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. 45 మంది లొంగిపోయారు. , 22 మంది ఎన్కౌంటర్లలో మృతి చెందారని పోలీసులు తెలిపారు. హింసను వీడే వారికి పునరావాస విధానం కింద అవకాశం కల్పిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# జూరాలకు భారీగా పోటెత్తిన వరద
## 33 గేట్లు ఎత్తివేత

మహబూబ్ నగర్ కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుంది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు మహబూబ్ నగర్ జిల్లా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద పోటెత్తింది, దీంతో ప్రాజెక్టు కు 02 లక్షల 44 వేల క్యూసెక్కుల వరద నీళ్ళు చేరుతుండడంతో అధికారులు ప్రాజెక్టు 33 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు శ్రీశైలం ప్రాజెక్టుకు 02 లక్షల 49 వేల 387 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్ ఫ్లో: 02 లక్ష ల 44 వేల క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో: 02 లక్షల 49 వేల 387 క్యూసెక్కులు గా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516. మీటర్లు ప్రస్తుత నీటిమట్టం..317.370 మీటర్లు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు. ప్రస్తుత నీటి సామర్థ్యం 7.707 టీఎంసీలు. ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రలలో 11 యూనిట్ల లో434 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది.

# భూ పరిహార చెల్లింపులో జాప్యం
## ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశం

వికారాబాద్ వికారాబాద్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ పరిహార వివాదం సంచలన మలుపు తిరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రైతుకు చెల్లించాల్సిన పరిహారం ఇప్పటికీ అందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వికారాబాద్ సీనియర్ సివిల్ కోర్టు... ఏకంగా ఆర్డీవో కార్యాలయంలోని కదిలే ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. కోర్టు బెలిఫ్ కార్యాలయానికి చేరుకుని జప్తు ప్రక్రియ చేపట్టగా, అనంతరం రెండు నెలల్లో రూ.61.29 లక్షల పరిహారం చెల్లిస్తామని అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వడంతో జప్తు చేసిన వస్తువులను తిరిగి కార్యాలయ కస్టడీకే అప్పగించారు. 1986-87లో రైల్వే ప్రాజెక్టు కోసం రైతు శతాంక్ రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, అప్పట్లో గజానికి కేవలం రూ.50 మాత్రమే పరిహారం నిర్ణయించారు. దీనిపై కోర్టును ఆశ్రయించిన రైతు... జిల్లా కోర్టు నుంచి హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి చివరకు గజానికి రూ.125 చొప్పున పరిహారం పొందే హక్కును సాధించుకున్నారు. అయినప్పటికీ పరిహారం చెల్లింపులో జాప్యం కొనసాగడంతో కోర్టు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న ఈ భూ పరిహార పోరాటం ఇప్పుడు జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# కల్తీరాయుళ్లపైపీడీయాక్ట్ పెట్టాలి
## ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్ హైదరాబాద్ మసాలాల కల్తీ ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులకు గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ అభినందనలు తెలిపారు. కల్తీ రాయుళ్లపై పోలీసులు నమోదు చేస్తున్న చట్టపరమైన సెక్షన్లను వెంటనే మార్చాలని రాజా సింగ్ డిమాండ్ చేశారు. బలహీనమైన సెక్షన్ల వల్ల నిందితులు సులభంగా స్టేషన్ బెయిల్పై బయటకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ నేరస్తులపై కఠినమైన 'పీడీ యాక్ట్' ప్రయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కల్తీ రాయుళ్ల సమగ్ర వివరాలను బహిరంగంగా వెల్లడించాలని సూచించారు.

# తెలంగాణలో 60 లక్షల ఓట్లు కట్

హైదరాబాద్ ఇంతవరకు తెలంగాణలో ఆరవై లక్షల ఓట్లు కట్ అయ్యాయి. సర్ ప్రక్రియ పూర్తయ్యే అనంతరం 60 లక్షల ఓటర్ల సంఖ్య తగ్గవచ్చని అధికారులు అంచనా. దాదాపు 40 లక్షల మంది ఓటర్లు జాబితాలోని అడ్రస్లో అందుబాటులో లేరని అధికారులు గుర్తించారు. చనిపోయిన వారు, తెలంగాణలో ఓటున్న పక్క రాష్ట్రాల వారు, రెండు, మూడు ఓట్లున్న వారు మరో 20 లక్షల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. దీంతో మొత్తం 60 లక్షల ఓట్లు తొలగించే అవకాశముంది.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీ పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు కొమ్ముగూడెం ప్రాంతం నుంచి వస్తున్న జీరో ఇసుక లారీని పోలీసులు మంగళవారం అం ర్రాత్రి సమయంలో పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి లారీని పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసులు తనిఖీలు చేపట్టిన సమయంలో డ్రైవర్ పరారైనట్లు సమాచారం. ఈ లారీ అశ్వాపురం మండలానికి చెందిన వ్యక్తిదిగా పోలీసులు అనుమానిస్తూ, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# నడిరోడ్డుపై బస్సులో మంటలు..!
## ఐదుగురి ప్రాణాలు కాపాడిన డ్రైవర్

అనకాపల్లి యలమంచిలి మండలం పులపర్తి జంక్షన్ వద్ద పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మహిళా కార్మికులను తీసుకెళ్తున్న ప్రైవేట్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు.ఏటికొప్పాక నుంచి అచ్యుతాపురం పరిశ్రమకు మహిళా కార్మికులను తీసుకెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. బస్సు ఇంజన్‌లోంచి ఒక్కసారిగా మంటలు రావడాన్ని గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే బస్సును ఆపేశాడు.ఆ తర్వాత సమయస్ఫూర్తితో ఐదుగురు మహిళా కార్మికులను సురక్షితంగా కిందకు దింపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం మంటలు బస్సును పూర్తిగా ఆవరించాయి.డ్రైవర్ అప్రమత్తత వల్లే ఐదుగురు మహిళా కార్మికులు క్షేమంగా బయటపడగా, ఈ ఘటనపై స్థానికులు డ్రైవర్‌ను అభినందిస్తున్నారు.

## ఏఐ ఆధారిత టీజీఐ పాస్‌తో అనుమతులు వేగవంతం

**(హెచ్.ప్రతాప్)**

పారిశ్రామిక అభివృద్ధికి వేగవంతమైన అనుమతుల వ్యవస్థ అత్యంత కీలకం. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం టీజీఐ పాస్ వ్యవస్థను కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికతతో మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుతోంది. దీంతో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పారదర్శకత, జవాబుదారీతనం కూడా పెరగనున్నాయి.

సాంప్రదాయ విధానంలో వివిధ శాఖలకు దరఖాస్తులు పంపించడం, పత్రాల పరిశీలన, సమాచారం లోపిస్తే మళ్లీ దరఖాస్తుదారునికి పంపించడం వంటి ప్రక్రియలకు ఎక్కువ సమయం పట్టేది. ఏఐ ఆధారిత టీజీఐ పాస్‌లో మాత్రం దరఖాస్తు సమర్పించిన వెంటనే పత్రాలను స్వయంచాలకంగా పరిశీలించి, లోపాలు ఉంటే వెంటనే గుర్తించి తెలియజేస్తుంది. దీనివల్ల అనవసర జాప్యం తగ్గి, అధికారులు కూడా క్లిష్టమైన అంశాలపైనే ఎక్కువ దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

ఏఐ వినియోగం ద్వారా దరఖాస్తుల వర్గీకరణ, శాఖల మధ్య సమన్వయం, గడువుల పర్యవేక్షణ, పెండింగ్ ఫైళ్ల గుర్తింపు వంటి ప్రక్రియలు మరింత సమర్థంగా నిర్వహించవచ్చు. అలాగే దరఖాస్తుదారులు తమ అనుమతి ఏ దశలో ఉందో తక్షణమే తెలుసుకునే అవకాశం లభిస్తుంది. ఇది ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. భవిష్యత్తులో డేటా విశ్లేషణ ఆధారంగా ఏ రంగాల్లో ఎక్కువ పెట్టుబడులు వస్తున్నాయి, ఏ శాఖల్లో జాప్యం జరుగుతోంది వంటి అంశాలను కూడా ప్రభుత్వం సులభంగా విశ్లేషించి తక్షణ చర్యలు తీసుకునే వీలు కలుగుతుంది.

పెట్టుబడిదారుల దృష్టిలో వేగవంతమైన అనుమతుల వ్యవస్థ ఒక ప్రధాన ఆకర్షణ. అనుమతుల కోసం ఎక్కువ కాలం నిరీక్షించాల్సిన అవసరం లేకపోతే కొత్త పరిశ్రమలు త్వరగా ప్రారంభమవుతాయి. ఫలితంగా పెట్టుబడులు పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఇది మరింత ప్రయోజనకరంగా మారి, స్థానిక పారిశ్రామిక వృద్ధికి బలాన్నిస్తుంది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఇది బలమైన పునాది అవుతుంది.

అయితే ఏఐ ఆధారిత వ్యవస్థను విజయవంతంగా అమలు చేయాలంటే డేటా భద్రత, గోప్యత, సైబర్ రక్షణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, సాంకేతిక మౌలిక వసతులను నిరంతరం నవీకరించాల్సి ఉంటుంది. మానవ నిర్ణయ సామర్థ్యానికి తోడ్పడే సాధనంగా ఏఐని వినియోగించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయి.

సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ పారిశ్రామిక అనుమతుల ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో ఏఐ ఆధారిత టీజీఐ పాస్ ఒక ముందడుగు. సమయపాలన, పారదర్శకత, పెట్టుబడులకు అనుకూల వాతావరణం అనే మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించే ఈ విధానం తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి కొత్త దిశను చూపడమే కాకుండా, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశముంది. డిజిటల్ పాలనలో తెలంగాణ మరో ముందడుగు వేస్తోందనే విశ్వాసాన్ని ఈ కార్యక్రమం మరింత బలోపేతం చేస్తుంది.

## 7 న బెంగళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభకు తరలి వెళ్లిన వెయ్యి మంది ఓబీసీ బి సి నాయకులు



హైద్రాబాద్ ఆగస్ట్ 5;ఈ నెల 7 న బెంగళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభకు హైద్రాబాద్ నుండి దాదాపు వెయ్యి మంది ఓబీసీ బి సి నాయకులు పది బస్సులలో బయలుదేరి వెళ్లారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జా జూల శ్రీనివాస్ గౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అమరవీరుల స్థూపం దగ్గర జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారిలు మాట్లాడుతూ బెంగళూరులో జరిగే ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.



ఈ కార్యక్రమం లో గుజ్జ కృష్ణ వైస్ చైర్మన్ కుల్కచర్ల శీను వాస్ ముదిరాజ్ జాతీయ వడ్డెర సంఘం అధ్యక్షులు పిట్ల శ్రీధర్ రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్ మహిళా అధ్యక్షురాలు మని మంజరి తారకేశ్వరి సెక్రెటరీ సిద్ధాంత శ్యామల అనంతో బ్రహ్మాచారి జనగాం నరసింహాచారి వెంకటాచారి వరలక్ష్మి శోభ లింగం గౌడ్ భాస్కరు బండి గారి రాజు మీరు భాస్కర్ తండోప దండాలుగా బీ సి నాయకులు బెంగళూరు వెళ్లడం జరిగినది.

## వరంగల్ లో రైల్వే క్రాసింగ్ సమస్యలపై పార్లమెంట్ లో ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య..



వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ప్రమాదాలను తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జిలు (ఖీూఃలు), రైల్వే అండర్ బ్రిడ్జిలు (ఖీఱః లు), లెవల్ క్రాసింగ్‌ల తొలగింపు పనుల పురోగతిపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో కీలక ప్రశ్న లేవనెత్తారు..

గత ఐదేళ్లలో వరంగల్ జిల్లాలో ఆమోదించిన ఖీూఃలు, ఖీఱఃలు, లెవల్ క్రాసింగ్‌ల నిర్మూలన పనుల వివరాలు, వాటి వ్యయం, నిధుల విధానం, ప్రస్తుతం పనుల పురోగతి, ఖర్చు చేసిన నిధులు, పూర్తయ్యే గడువు వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు..

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈమేరకు 2026 జూన్ 1 నాటికి వరంగల్ జిల్లాలో 3 రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, 7 రైల్వే అండర్ బ్రిడ్జిలు, 8 లెవల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, ప్రస్తుతం వరంగల్ జిల్లాలో 4 ఖీూః/ఖీఱః పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.

వాటిలో వరంగల్? చింతలపల్లి మధ్య లెవల్ క్రాసింగ్ నెం.64 వద్ద రూ.77 కోట్లతో ఖీూః నిర్మాణానికి టెండర్ ఖరారైందన్నారు. అలాగే కాజీపేట?వరంగల్ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.60, ఎల్గూర్?నెక్కొండ మధ్య లెవల్ క్రాసింగ్ నెం.66, 67 వద్ద మరో మూడు ఖీూఃలను రాష్ట్ర ప్రభుత్వమే తన స్వంత నిధులతో చేపట్టినట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.4,883 కోట్ల అంచనా వ్యయంతో 118 ఖీూః/ఖీఱః పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ,..

వరంగల్ జిల్లాలో రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల ముప్పు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఖీూః, ఖీఱః పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా టెండర్ పూర్తయిన పనులు, ఉంఆ దశలో ఉన్న ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూడు ఖీూఃల నిర్మాణానికి కూడా రైల్వే శాఖ పూర్తి సహకారం అందించాలని సూచించారు.

వరంగల్ జిల్లా ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని రవాణా సౌకర్యం కల్పించేందుకు పార్లమెంట్‌లో తన ప్రయత్నాలను నిరంతరం కొనసాగిస్తానని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు..

## విద్యార్థులకు శాస్త్రీయ ఆధునిక నైపుణ్యాలు అందించే విద్యా విధానం కావాలి

**-PDSU రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతుల్లో ప్రముఖ సామాజిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్**



హైద్రాబాద్ ఆగస్ట్ 5 ;విద్యార్థులకు లౌకిక ప్రజాతంత్ర శాస్త్రీయ ఆధునిక నైపుణ్యాలు పెంపొందించే విద్యా విధానం రూపొందించకుండా మత చాందస భావాలు, సాంఘిక దురాచారాలు, అసమానతలు కొనసాగే నూతన జాతీయ విద్య విధానాన్ని అమలుపరుస్తున్నారని అందువలన నూతన జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా విద్యార్థులంతా పోరాడాలని ప్రముఖ సామాజిక విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ గారు అన్నారు. హైదరాబాద్ కొత్తపేటలోని డాక్టర్ బాబు జగజీవన్ రామ్ భవనంలోౖాణూఖ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు రాష్ట్ర అధ్యక్షుడు కె.పవన్ కుమార్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయ ఆర్థిక సామాజిక పరిస్థితులు నూతన జాతీయ విద్యా విధానం అనే అంశంపై ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యపై జాతీయ స్థూల ఆదాయంలో కనీసం రెండు శాతం కూడా విద్యపై ఖర్చుపెట్టడం లేదని లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల నుండి డ్రాపౌట్లుగా మిగిలిపోతున్నారని మొత్తం విద్యను అభ్యసించే విద్యార్థుల్లో 35 నుండి 40% వరకు పాఠ్యాంశాలను అర్థం చేసుకునే స్థితిలో విద్యార్థులు లేరని అన్నారు ప్రభుత్వ విద్యాసంస్థలను ధ్వంసం చేసి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలను కళాశాలలను యూనివర్సిటీలను నెల కోల్పోయిందికే నూతన జాతీయ విద్యా విధానం మద్దతునిస్తోందనీ,పేద విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్కాలర్షిప్స్ వంటి సంక్షేమ పథకాలను నూతన జాతీయ విద్యా విధానం వ్యతిరేకిస్తున్నదని వీటిని మెరిట్ ప్రాతిపదికన విద్యార్థులకు ఇవ్వాలనే డిమాండ్స్ ను సమర్థిస్తున్నదనీ అన్నారు. పురాణాలను మత చాందస భావాలను పెంచే విషయాలపై అధ్యయనాలు జరిగే విద్యా విధానం ప్రమాదకరమైనదనీ దాని స్థానంలో ప్రజాస్వామిక విలువలు కలిగిన విద్య కావాలని అన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చినప్పటి నుండి ఈ పదేళ్ల కాలంలో దేశంలో 150 ప్రశ్న పత్రాలు లీకయ్యాయని ఫలితంగా ఎంతో మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఇది విద్యా వ్యవస్థలో ఉన్నటువంటి తీవ్రమైన సంక్షోభాన్ని స్పష్టం చేస్తున్నదని తెలిపారు. దేశంలో ఉన్నటువంటి లక్షలాది మంది యువత తాము చదువుకున్నటువంటి చదువుకు తగ్గట్టు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక మళ్ళీ వ్యవసాయ రంగం పై ఆధారపడే స్థితి నెలకొని ఉందని అన్నారు. అందుకనే ఆదానే వంటి పెట్టుబడిదారుల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా ప్రజలను మభ్యపెడుతూ తప్పుడు హామీలు ఇస్తున్నారని విమర్శించారు. ఈ దేశంలో ఉన్నటువంటి ఆర్థిక రాజకీయ, సామాజిక సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుంది. అందుకే దేశీయ ప్రయోజనాలే ప్రాతిపదిక కలిగిన విద్యా విధానం కావాల్సిందేనని అన్నారు.




అదేవిధంగా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.... భారతదేశంలో ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా వర్ణ వ్యవస్థ ఉన్న పురాణాల కాలం నుండే క్రింది వర్గాల విద్యార్థులు విద్యకు దూరంగా ఉన్నారని విద్యలో ఏ దేశం అయితే ఎక్కువ అభివృద్ధి సాధిస్తుందో ఆ దేశం అన్ని రంగాల్లో ముందుకు పోతుందని తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో యూనివర్సిటీల్లో బోధనా సిబ్బందిని నియమించకుండా , నిధులు కేటాయించకుండా విద్యలో అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందని పాలకులను ప్రశ్నించారు. విద్యావ్యవస్థలో అసమానతల కారణంగా సంపన్న వర్గాల విద్యార్థులకే మంచి విద్య అందుతున్నదని పేద విద్యార్థులకు అందడం లేదని అన్నారు. ఈ అసమానతలు తొలగిపోవాలంటే కామన్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశంలో మతం , కులం పేరుతో చేసే రాజకీయాలను విద్యార్థులు వ్యతిరేకించాలని సమాజంలో ఉన్న అసమానతలకు వ్యతిరేకంగా సమ సమాజం కోసం విద్యార్థులు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో PDSU జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్ ఖన్నా, పి ఓ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సరళ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఎల్ గణేష్, PDSU రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎంపి వంశీ కుమార్, రాష్ట్ర నాయకులు ప్రవీణ్, యువజన, అనిల్, సైదులు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు

## మిషన్ హరితాంధ్రకు శ్రీకారం ప్రకాశం జిల్లా పోలీసులు మొక్కల నాటకం ప్రారంభం



ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు "మిషన్ హరితాంధ్ర" కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మొక్కల నాటకం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జిల్లాలోని పోలీసు కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు మరియు ఇతర పోలీసు శాఖ ప్రాంగణాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు.

పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించి, భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# విద్యార్థులు వృద్ధిలోకి వచ్చేలా విధులు నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కె. హైమావతి

**సిద్దిపేట ప్రజాబలం ప్రతినిధి:** సిద్దిపేట విద్యార్థులు వృద్ధిలోకి వచ్చేలా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఉపాధ్యాయులను ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలో టిటిసి భవనంలోని సమావేశ మందిరంలో ఎంఈఓ లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, హై స్కూల్ హెడ్మాస్టర్లు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్ళు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించి విద్యాశాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యాశాఖ అత్యంత ముఖ్యమైనదని రాష్ట్ర ముఖ్యమంత్రి దగ్గరే ఉంచుకొని పర్యవేక్షిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరిగి మంచి ఫలితాలను తీసుకురావాలని అన్నారు.



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ లక్ష్యానికి అనుగుణంగా జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేసి నిర్లక్ష్యం వీడి ఎన్రోల్మెంట్ పెంచాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జెడ్పీ హైస్కూల్లో ప్రవేశానికి పోటీ ఎందుకు ఉందని ?, ఇదే సిద్దిపేటలోని ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హై స్కూల్లో ఎన్రోల్మెంట్ ఎందుకు సరిగా లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు అన్ని సక్రమంగా ఉన్నా కూడా ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేకపోవడం, నమ్మకం లేకపోవడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తూనే ప్రైవేట్ స్కూళ్లలో కూడా పనిచేస్తున్నారని అటువంటి వారిని గుర్తించి విధుల్లో నుంచి తొలగించాలని డిఈఓ కు సూచించారు. టీచర్లు ఎంతమంది రోజు విధులకు హాజరవుతున్నారో ముఖ గుర్తింపు హాజరు ఎఫ్ ఆర్ ఎస్ వివరాలను సాయంత్రంలోగా అందించాలని అన్నారు. వారితోపాటు సిఆర్పి ల వివరాలను కూడా అందించాలని అన్నారు. ఇప్పటికే పాఠశాలలు పునః ప్రారంభమై ఒకటిన్నర నెలలు కలుస్తున్న రెండు, మూడు లెసన్స్ కూడా పూర్తి కాలేదని అన్నారు. ఒకటి, రెండు, మూడో తరగతి విద్యార్థులకు కచ్చితంగా చదవడం, రావడం రావాలని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి స్కూల్ వారీగా పూర్తి సమాచారం తన వద్ద ఉందని ఇప్పటికైనా ప్రవర్తన మార్చుకొని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు.విద్యార్థుల ఆధార్ అప్డేట్ గురువారం లోగా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఏఎంఓ రామస్వామి, మండల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ హెచ్ఎంలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్ళు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు

# బడి పిల్లల భద్రతే లక్ష్యం.. పాఠశాల వాహనాలపై ముమ్మర తనిఖీలు

## రెండు టాటా ఏసీ వాహనాలు సీజ్



**వేములవాడ, ఆగస్టు 5 (ప్రజాబలం ప్రతినిధి):**రాజన్న సిరిసిల్ల జిల్లాలో బడి పిల్లలను తరలించే వాహనాలపై మోటారు వాహనాల శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వేములవాడ నుంచి చందుర్తి, రుద్రంగి ప్రాంతాల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించి అధిక సంఖ్యలో విద్యార్థులను తరలిస్తున్న వాహనాలను గుర్తించి సంబంధిత వాహనాలపై కేసులు నమోదు చేశారు.

ఈ సందర్భంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి గంధం వంశీధర్ మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులను తరలించే ప్రతి వాహనం భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. డ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలను వెంట ఉంచుకోవాలని, పరిమితికి మించి విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకెళ్లరాదని హెచ్చరించారు.




తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన రెండు మోటార్ క్యాబ్ టాటా ఏసీ వాహనాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు జిల్లాలో నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఈ తనిఖీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లా మోటారు వాహనాల తనిఖీ అధికారి గంధం వంశీధర్‌తో పాటు కానిస్టేబుల్ రమ్య, హోంగార్డు ఎల్లయ్య పాల్గొన్నారు.

# భూసేకరణ అంతా చట్టబద్ధమే

## తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

## జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 5:**సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన అల్వాల్ భూయజమానులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్.



బుధవారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి 2264 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన అల్వాల్ భూయాజమానులకు డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ 33 కోట్ల రూపాయల పరిహార నిధుల చెక్కును అందజేసారు.

అనంతరం ప్రత్యేక భూసేకరణ అధికారి మాలతి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నఈ ప్రాజెక్టులో భాగంగా అల్వాల్‌లోని స్థలానికి సంబంధించి ఇటీవల జరుగుతున్న అసత్య ప్రచారాలను మరియు తప్పుడు ఆరోపణలను వ్యతిరేకిస్తున్నానన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియలు మరియు రికార్డులను పక్కనబెట్టి, సర్వే నంబరు 168 భూమి పై ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార వార్తలను ప్రజలకు చేరవేయకూడదని స్పష్టం చేసారు.

# భక్తి పారవశ్యంలో బోనాల ఉత్సవాలు

## ఎం ఎం సి కార్యాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న తాడూరి శ్రీనివాస్, కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 5:** తార్నాకలోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (వీజీ) ప్రధాన కార్యాలయంలో బోనాల పండుగను పురస్కరించుకుని బుధవారం ఘనంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎం ఎం సి ప్రధాన కార్యాలయ సిబ్బంది, బి ఎం ఎస్ యూనియన్ నాయకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలంగాణ తొలి ఎం బి సి కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్,ఎం ఎం సి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని వారు ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో చిల్కానగర్ బిజెపి కార్పొరేటర్ అభ్యర్థి గోనె శ్రీకాంత్ ముదిరాజ్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బిజెపి ఓ బి సి మోర్చా కార్యదర్శి రత్నపురం వెంకటేశ్వర్లు, ఏఎస్ రావు నగర్ డివిజన్ సీనియర్ నాయకుడు ఏనుగు సీతారాం రెడ్డి,బి ఎం ఎస్ యూనియన్ నాయకులు, కార్మికులు, కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కోర్టు తీర్పుకే దిక్కులేదు.. రెవెన్యూ గిమ్మిక్కులు...

**పి జి ఆర్ ఎస్ ఫిర్యాదు పై తప్పుడు నివేదికలు...**

**బాధితుల పొట్ట కొట్టిన అధికారులు..**

**అధికారుల నిర్లక్ష్యంతో వీధిన పడ్డ నిరుపేద కుటుంబం..**

**.న్యాయస్థానం తీర్పు ఇచ్చినా దక్కని భూమి...?**




తిరుపతి : ఆగస్ట్ 5, ,తిరుపతిలో బాధితుల కన్నీటి గాథ, పరిష్కారమైంది అన్ని కాగితాల్లో రాశారు. తీరా చూస్తే భూమి ఆక్రమణలోనే ఉంది. ఇక పూర్తి వివరాల్లోకి వెళ్తే తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం నెత్తకుప్పం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్విపురంలో దారుణం వెలుగు చూసింది. సొంత అన్న కుమారుల చేతిలో మోసపోయిన ఇద్దరు చెల్లెలు, కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా లోకనాథరెడ్డి మాట్లాడుతూ.. తమ ఉమ్మడి కుటుంబ ఆస్తికి సంబంధించి 2012లోనే కోర్టు తీర్పు వచ్చిందని, కృష్ణమ్మకు 2.96 ఎకరాలు, గోవిందమ్మకు 2.96 ఎకరాలు కేటాయించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. అయితే ఈ విషయాన్ని ఇన్నేళ్లుగా దురుద్దేశపూర్వకంగా దాచిపెట్టి, వారే ఆ భూమిని అనుభవిస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా, ఇరగం రెడ్డి కె.మునిరెడ్డి ద్వారా తమను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.?రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, తప్పుడు నివేదికలు:బాధితులు తమ భూమిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తుంటే, క్షేత్రస్థాయిలో ఉండాల్సిన రెవెన్యూ అధికారులు బాధ్యత విస్మరించి ద్రోహులతో చేతులు కలిపారని తీవ్రంగా విమర్శించారు. జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదు చేస్తే.. సమస్య పరిష్కారమైపోయిందంటూ బాధ్యతారహితంగా తప్పుడు నివేదికలు పంపి అధికారులే తమ పొట్ట కొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటాయించిన భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా అధికారుల నుంచి కనీస స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.?ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై విచారణ జరిపించాలని కోరారు. కోర్టు తీర్పు ప్రకారం తమకు చెందాల్సిన భూమిని తక్షణమే ఇప్పించి తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో లోకనాథరెడ్డి తో పాటు రవికుమార్ రెడ్డి కృష్ణమ్మ గోవిందమ్మ పాల్గొన్నారు.

## రైడ్ షేరింగ్... పోలీస్ వెహికిల్

హైదరాబాద్, ఆగస్టు 5 శాఖాపరమైన విధులకు, అత్యవసర పెట్రోలింగ్‌కు ఉపయోగించాల్సిన పోలీస్ మొబైల్ వాహనం ఒక రైడ్ షేరింగ్ యాప్‌లో ప్రత్యక్షమై సాధారణ ప్రయాణికుడికి రవాణా సేవలు అందించడం సంచలనంగా మారింది. ఓ పౌరుడు స అనుమానంతో ర్యాపిడో యాప్‌లో బైక్ బుకింగ్ చేయగా, ఆయనను పికప్ చేసుకోవడానికి ఏకంగా పోలీస్ అధికారిక పెట్రోలింగ్ వాహనం వచ్చి ఆగింది. ఈ వింత పరిణామానికి ఆశ్చర్యపోయిన సదరు కస్టమర్, పికప్ పాయింట్ నుంచి డ్రాప్ లోకేషన్ వరకు ప్రయాణాన్ని తన స్మార్ట్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది.ఈ వైరల్ వీడియో క్లిప్‌లో సదరు ప్రయాణికుడు పోలీస్ వాహనంలో వెళ్తుండగా, డ్రైవింగ్ సీట్లో ఉన్న వ్యక్తి సాధారణ ప్రయాణాన్ని సాగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా రక్షణకు, అత్యవసర సేవలకు వినియోగించే ప్రభుత్వ వాహనాలు ప్రైవేట్ యాప్‌లలో కమర్షియల్ రైడింగ్ కోసం ఎలా అందుబాటులోకి వచ్చాయనే అంశంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, ఇంధనం దుర్వినియోగం కావడంపై నెటిజన్లు రకరకాల కామెంట్లతో నిరసన వ్యక్తంచేస్తున్నారు.అయితే, ఈ వాహనం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందినదా లేదా కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోనిదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. నంబర్ ప్లేట్ , వాహనంపై ఉన్న స్టిక్కరింగ్ ఆధారంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమికంగా పరిశీలిస్తున్నారు. సాంకేతికంగా యాప్‌లో డ్రైవర్ ఐడీ ఎలా రిజిస్టర్ అయింది, నిజంగానే పోలీస్ డ్రైవర్ ఈ పనికి ఒడిగట్టాడా లేక వాహనాన్ని ప్రైవేట్ వ్యక్తులు సర్వీసింగ్, మెయింటెనెన్స్ కోసం తీసుకెళ్లినప్పుడు ఇలా చేశారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.ప్రజా సేవల కోసం కేటాయించిన వాహనాన్ని వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించడం తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుంది. ఈ ఘటనపై సంబంధిత జిల్లాల పోలీస్ కమిషనర్లు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. వాహనంలో ఉన్న సిబ్బందిని లేదా వాహన బాధ్యత వహించే డ్రైవర్‌ను గుర్తించి, ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

# మణికొండలో బి.ఆర్.ఎస్ పార్టీ మహిళా నాయకురాలు రూపారెడ్డి ఘరానా మోసాలు.



గండిపేట ప్రజాబలం ప్రతినిధి 5 ఆగస్టు 2026. చిన్న చితక వ్యాపారుల నుండి కోట్లు కొల్లగొట్టి ప్రజలకు కుచ్చుటోపి పెట్టి ఎగనామం పెట్టిన రూపారెడ్డి, పరిణామంగా తిరుమల హిల్స్, నైన్ స్టార్ హిల్స్ అపార్టమెంట్ లోని రూపారెడ్డి నివాసానికి చేరుకున్న బాధితులు మాట్లాడుతూ రూపాయి రూపాయి కూడా పెట్టి దాచుకున్న డబ్బులను ఇచ్చామని నెలలు సంవత్సరాలు గడుస్తున్నా కూడా ఒక్క రూపాయి తిరిగి ఇవ్వకపోవడంతో రూపారెడ్డి ఇంటి ముందర ఆందోళన చేయాల్సి వస్తుందని, ఆ సందర్భంగా ఒకావిడ మూర్చ పోవడం జరిగిందని, మాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడ నుండి వెళ్లి ప్రసక్తే లేదంటూ ఆందోళన దిగిన వందల సంఖ్యలో బాధితులు తెలిపారు.

# భారతదేశ పౌరులకు ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు



భారతదేశ పౌరులకు ఓటు అనేది భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు, అట్టి ఓటు హక్కును కాపాడుకుంటూ, సద్వినియోగం చేసుకోడానికి గాను ప్రజాస్వామ్య పద్ధతిని అనుసరించి చట్టబద్ధతగా ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. అట్టి ప్రక్రియలో పోలింగ్ బుతు లెవల్ అధికారుల పాత్ర కీలకం కాగా ఓటు విషయమై సంబంధిత బి.ఎల్.ఒ ల వద్ద ఫారాలు పొంధి, 2002 సంవత్సరంలోని వారి స్వంతం లేదా వారి పూర్వీకుల ఓటు వివరాలు సేకరించి ఓటు ఎన్యుమరేషన్ ధరకాస్తూ ఫారం పూరించి మ్యాపింగ్ చేయడం ప్రతి ఒటరు కర్తవ్యంగా మొదట 24 జూలై తో ముగుస్తుందని, తదుపరి ఆగస్టు 3 తో ముగుస్తుందని ప్రజలు అబిప్రాయపడుతున్న సమయంలో, అనివార్య కారణాలవల్ల ఎన్యూమరేషన్ ఫారం నింపని ఓటర్లకు వీలు కలుగుతుందని కార్యచరణ కాస్తా 10 ఆగస్టు వరకూ పెంచడం జరిగింది. ఇట్టి సదవకాశంను ప్రజలు సద్వినియోగం పరుచు కోవాలనె సదుద్దేశంతో గత మండల రోజులుగా బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు తలపెట్టిన ఓటర్ జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సహాయ శిబిరంనకు మంచి స్పందన లభించిందని, బుధవారం రోజున స్థానిక ప్రజలతో చేధోడు వాదోడుగా ఉంటూ ఓటు ప్రక్రియలో సంపూర్ణ అవగాహన కల్పిస్తూ సహకారన్ని అందించడం జరిగిందని ఇట్టి సహకారం ఆగస్టు 10 వరకు కొనసాగిస్తామని మణికొండ, నెక్నంపూర్ డివిజన్ ప్రజలకు ఎల్లవేలల అందుబాటులో ఉంటామని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకుడు అందె లక్ష్మణ్ రావు తెలుపుతూ అవసర నిమిత్తం తనను ఫోన్ 8297003033 ద్వారా సంప్రదించ వచ్చని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గుట్టమీది నరేందర్, సుమనలిని, షేక్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆల్గోల్ విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



జహీరాబాద్, ఆగస్టు 5 ప్రజాబలం ప్రతినిధి: మండలంలోని ఆల్గోల్ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ చల్లా శ్రీనివాస్ రెడ్డి జహీరాబాద్ విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు, విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యల వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈ శ్రీనివాస్ సమస్యలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పసుపుల ప్రభాకర్, అలోక్, ఎం. అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10న జైల్ భరోను జయప్రదం చేయండి: రాంచందర్




జహీరాబాద్ ఆగస్టు 5 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ లో పారిశ్రామిక క్లస్టర్, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో CITU జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహీపాల్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగం ఆరోపణలు నిరాధారం నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధం

## -- గుంజెటి సర్పంచ్ దేశెట్టి పాటిల్



న్యాల్కల్, ఆగస్టు 5 ప్రజాబలం ప్రతినిధి: గుంజెటి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ ఇటీవల కొన్ని దినపత్రికల్లో ప్రచురితమైన కథనాలు పూర్తిగా అవాస్తవమని గ్రామ సర్పంచ్ దేశెట్టి పాటిల్ స్పష్టం చేశారు. గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచి గ్రామాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నానని, వ్యక్తిగత కక్షలు లేదా అక్రమాలకు తావులేదన్నారు.

గ్రామంలో ఇటీవల నిర్మించిన మురుగు కాలువ భారీ వర్షాల కారణంగా కొద్దిపాటి కుంగుబాటుకు గురైందని, నాణ్యతలో ఎలాంటి లోపం లేకపోవడంతో సంబంధిత గుత్తేదారు వెంటనే మరమ్మతులు చేపట్టారని తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. గ్రామ పంచాయతీ నిధుల్లో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరిగినట్లు ఎవరైనా నిరూపిస్తే చట్టపరంగా ఎలాంటి చర్యలకైనా సిద్ధంగా ఉంటానని దేశెట్టి పాటిల్ సవాల్ విసిరారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్‌పై కూడా ఆయన ఆరోపణలు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్--5లో ఉన్న 1 ఎకరం 26 గుంటల అసైన్‌మెంట్ భూమిని అక్రమంగా కుటుంబ సభ్యుల పేర్లపై పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. అలాగే అదే సర్వే నంబర్‌లో అసైన్‌మెంట్ భూములను అక్రమంగా విక్రయించిన అంశంపై ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అసైన్‌మెంట్ భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమ పట్టాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ జీవన్, వార్డు సభ్యులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



జహీరాబాద్, ఆగస్టు 5 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెం. 1లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల అభివృద్ధే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి వంటి సౌకర్యాలను దశలవారీగా కల్పిస్తామని చెప్పారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్, డీఈ మహేష్, ఏఈ వెంకటేష్, వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ రంగా అరుణ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

# తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికైన రాజుకు సన్మానం

## పత్రికలు ప్రజా వారధిగా పనిచేయాలి మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్

అందోల్ నియోజకవర్గంల ప్రతినిధి ఆగస్టు 05 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీగా ఎన్నికైన జోగిపేట, పట్టణానికి చెందిన ఉలువల రాజుకు ఈశుభ సందర్భంగా ఆయన చిన్ననాటి మిత్రులు ఈ రోజు బుధవారం వారి నివాసంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడంజరిగింది. విద్యార్థి దశలోనే క్లాస్ మానిటర్గాచురుకైన పాత్రను పోషిస్తూ అంచలంచలుగా జోగిపేట నెహ్రూ మెమోరియల్ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్ గా అలాగే జర్నలిజంలోఅడుగుపెట్టిన అతి చిన్నవయసులోనే సంగారెడ్డిజిల్లా ఆర్గనైజర్ సెక్రెటరీగా నియమితులైన శుభ సందర్భంగా వారికి ఈరోజు ఘనంగా పూలమాలలు




శాలువలతో సత్కరించడంజరిగింది. మా మిత్రుడు అంచలంచలుగా జిల్లా స్థాయి లెవెల్లో ఎదగడం అనేది సామాన్యమైన విషయం కాదు ఇంకా పత్రికా రంగంలోజిల్లా స్థాయిలో మంచి పేరును సంపాదించుకోవాలని అంచలంచెలుగా జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు చేరాలని వారి సేవలు ప్రజాసేవకై ప్రతినిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ పత్రిక ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను ప్రభుత్వం చేస్తున్నటువంటి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంచి చెడులను ప్రజలకు వారి పత్రికా ద్వారా నిజా నిజాలను రాయాలని ఆకాంక్షిస్తూ వారి పాత్ర విలువైనదని ఈ సందర్భంగా వారి చిన్ననాటి స్నేహితులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో:- మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తుపాకుల సునీల్ కుమార్, రెడ్డిపల్లి శ్రీనివాస్, కొత్త శ్రీశైలం,శ్రీనివాస్ రెడ్డి,ఆకుల నందు, తదితరులు పాల్గొన్నారు.....

# వెంటిలేటర్ పై వైసీపీ

విజయవాడ, ఆగస్టు 5 మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలంటూ వైసీపీ చేస్తున్న రచ్చపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు నిప్పులు చెరిగారు. వైసీపీ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ఆయన.. ఆ డిమాండ్ పూర్తిగా అసంబద్ధమైనదని, ఆమోదయోగ్యం కాదని తెగేసి చెప్పారు. ముఖ్యంగా, తమను తాము నవతరం 'జెన్-జీ' నేతలుగా ఊహించుకుంటున్న వైసీపీ నాయకులు... 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలచే తిరస్కరించబడిన 'జెన్-ఎక్స్' నాయకులని ముందుగా తెలుసుకోవాలని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో విధ్వంసం, దోపిడీనే ధ్యేయంగా పనిచేసిన ఆ పార్టీ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఊపిరి పీల్చుకుంటోందని వ్యాఖ్యానించారు. కేవలం సొంత రాజకీయ ఉనికి కోసం ఆడుతున్న నాటకాలు, పగటి వేషాలు, నకిలీ నినాదాలను చూసి ప్రజలు మళ్లీ మోసపోరని స్పష్టం చేశారు.

# నేరడిగుంట ఎక్స్ రోడ్డులో ఘనంగా బోనాల పండుగ



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 5 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :ఆందోల్ మండలం నేరడిగుంట, ఎక్స్ రోడ్డులో ప్రతీ సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఎక్స్ రోడ్డు వ్యాపారస్తులు అందరూ కలిసి ఈ బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఎక్స్ రోడ్డు అభివృద్ధి కాకమునుపే అక్కడ ఎల్లమ్మ తల్లి ఆలయం ఉంది అందుకు ఆమె చలువ ఆశీర్వాదాలతోనే ఎంతో మందికి ఈ ఎక్స్ రోడ్డు జీవనాధారం అయ్యింది.మొదట దేశ్ టీ పాయింట్ నుండి బోనాలు ప్రారంభం



అయ్యి పోతురాజులవిన్యాసాలతో,భక్తుల ఆటపాటలతో అంగరంగ వైభవంగా అమ్మవారికి బోనం సమర్పించారు.చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మరియు వ్యాపారస్తులు వారి ఆడపడుచులు అందరూ కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆందోల్ మార్కెట్ కమిటీ చేర్మన్ మక్త జగన్మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మఠం భిక్షపతి, ఎక్స్ రోడ్డు అభివృద్ధి ప్రదాతలు మాజీ సర్పంచ్ చందులత వీరమల్లప్ప,పట్లోళ్ల రాజు పటేల్,మాజీ జెడ్పిటీసీ రమేశ్,మాజీ ఎంపీపీ రామగౌడ్,సోషల్ వర్కర్ శ్రీధర్ రెడ్డి,మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు మిద్దెల గాలిరెడ్డి, సంగెం శంకరయ్య,యాదవ సంఘం అధ్యక్షుడు బ్రహ్మండ్ల పల్లి శంకర్,మానవ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు చాకలి మొగులయ్య,వ్యాపారస్తులు మంగలి వీరేశం తో పాటు అందరూ వ్యాపారస్తులు,తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా జోగిపేట్ ఎస్సై స్పెషల్ అట్రాక్షన్ గా వచ్చి వెళ్లడం జరిగింది.పిలవగానే బోనాల జాతరకు వచ్చి విజయవంతం చేసిన పెద్దలకుప్రజలకు,వ్యాపారులకు, మిద్దెల శ్రీధర్ రెడ్డి, మంగలి వీరేశం కృతజ్ఞతలు తెలియజేశారు,..

## బోలక్‌పూర్‌లో ఘనంగా బీరప్ప, అక్క మహంకాళి బోనాలు... ఘనంగా కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు.





**కూకట్పల్లి (ప్రజాబలం ) ఆగస్టు 05:**బోలక్‌పూర్ డివిజన్ పరిధిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, అక్క మహంకాళి బోనాల పండుగను అత్యంత వైభవంగా, నిర్వహించారు. కుల పెద్దలందరి ఆధ్వర్యంలో ఈ వేడుకలు కన్నుల పండుగగా సాగాయి.ఈ సందర్భంగా భక్తులు తొలుత బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్క మహంకాళి అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. బీరప్ప ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు ప్రధాన వీధుల గుండా అక్క మహంకాళి గుడి వరకు కోలాహలంగా కొనసాగింది.సంప్రదాయ డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాలతో ఊరేగింపు మార్గమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి, బీరప్ప స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు, కుల పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఉత్సవాల అనంతరం భక్తులకు అమ్మవారి ప్రసాద వితరణ చేపట్టారు.

## పిల్లిగుండ్ల సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 5(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలంపిల్లి గుండ్ల గ్రామానికి చెందిన బ్యాగరి మల్లయ్య చనిపోవడం జరిగింది వారి కుటుంబానికి పిల్లి గుండ్ల సర్పంచ్ ఆకుల పద్మ సంజీవరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపి అంత్యక్రియల నిమిత్తం 5000 రూపాయలు ఆర్థిక సాయం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్స్ ముష్టి రాములు, బుదరం చంద్రయ్య, రచయ్య మొగులయ్య, యేసయ్య మల్లయ్య శేఖర్ ,శ్రీశైలం ,యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డిలో సురక్షా కా తిరంగా"జాతీయ సైబర్ జాగ్రూకత అవగాహన కార్యక్రమాలు...

## అత్యాశకు లోనై సైబర్ మోసాలకు గురికావద్దు:అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 05(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి.వి. ఆనంద్, ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికా గోయల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు నెలరోజుల పాటు "సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" పేరుతో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు,ఆగస్టు నెల



తొలి బుధవారం నిర్వహించే జాతీయ సైబర్ జాగ్రూకత దివస్ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని సెయింట్ ఆంథోనీ డిగ్రీ కళాశాలలో నిర్వహించన "సురక్షా కా తిరంగా -- సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో సైబర్ నేరాలు ఒకటని అన్నారు. సైబర్ నేరాలకు గురవుతున్న వారిలో విద్యావంతులే అధికంగా ఉండటం ఆందోళనకర విషయమని పేర్కొన్నారు,తెలంగాణ రాష్ట్రంలో ఒక్క సంవత్సరంలోనే సైబర్ మోసాల కారణంగా సుమారు రూ.1,300 కోట్ల మేర ప్రజలు ఆర్థికంగా నష్టపోయారని తెలిపారు,తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయడం, నకిలీ పెట్టుబడి (స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్) ఆఫర్లు, వ్యాపార పెట్టుబడి పేరుతో వచ్చే మోసపూరిత సందేశాలను నమ్మడం వల్ల సైబర్ మోసాలకు గురవుతున్నారని చెప్పారు. సైబర్ నేరాలను నియంత్రించడంలో అప్రమత్తతే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు,తెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు,వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు,విద్యార్థులందరూ "సైబర్ అంబాసిడర్లుగా" వ్యవహరించి, తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు,"సురక్షా కా తిరంగా" సందేశంలోని మూడు రంగులు ప్రజలకు సైబర్ భద్రతపై మూడు ముఖ్యమైన సూచనలను అందిస్తున్నాయని అన్నారు,కాషాయం-- అప్రమత్తంగా ఉండండి సైబర్ మోసాలు,అనుమానాస్పద ఆన్‌లైన్ ఆఫర్ల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. లితెలుపు-- అవగాహన పెంచుకోండి,సైబర్ భద్రతపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత డిజిటల్ లావాదేవీలు చేయండి,ఆకుపచ్చ-- సురక్షితంగా ఉండండి: సురక్షితమైన సైబర్ విధానాలను పాటించి, డిజిటల్ భద్రతను కాపాడుకోవాలి,ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు మరియు ఇతర ఆన్‌లైన్ ఆర్థిక నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు,అనంతరం సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ,డిజిటల్ అరెస్ట్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు తదితర సైబర్ నేరాలపై షార్ట్ వీడియో ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా వెబ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడం ద్వారా ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. సైబర్ నేరాలపై అవగాహనే వాటి నివారణకు అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని తెలిపారు,ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల వ్యవస్థాపకులు, చైర్మన్ డా. సాల్మన్ రెడ్డి, డిగ్రీ కళాశాల డైరెక్టర్ విజయ్ కుమార్ రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ రామునాయుడు,సైబర్ సెల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు: అటవీ క్షేత్రాధికారి శ్యాంసుందర్ రావు



**జహీరాబాద్, ఆగస్టు 5 ప్రజాబలం ప్రతినిధి:** పోడు పట్టాలకు మించి అటవీ భూములను ఆక్రమించి సాగు చేయడం చట్టవిరుద్ధమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ అటవీ క్షేత్రాధికారి శ్యాంసుందర్ రావు హెచ్చరించారు. మొగుడంపల్లి మండలంలోని గుడుపల్లి, ఔరంగనగర్ గ్రామాల పరిధిలో కొందరు వ్యక్తులు అటవీ భూములను అక్రమంగా ఆక్రమించి సాగు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టి ఆక్రమణలను తొలగిస్తున్నట్లు వివరించారు. పోడు పట్టాలు మంజూరైన భూముల్లో మాత్రమే సాగు చేయాలని, వాటికి మించి అటవీ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని ఆయన స్పష్టం చేశారు. అటవీ సంపదను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్తులో ఎవరైనా కొత్తగా అటవీ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారి మీద అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అటవీ భూముల ఆక్రమణలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రజలు చట్టాలను గౌరవించి అటవీ భూములను రక్షించడంలో సహకరించాలని శ్యాంసుందర్ రావు విజ్ఞప్తి చేశారు.

## రైతుల త్యాగాలు మరవలేని

విజయవాడ, ఆగస్టు 5 అమరావతి వేదికగా జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర హోంమంత్రి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల ఆత్మగౌరవం అమరావతిలోనే ప్రతిబింబిస్తున్నాయని మంత్రులు స్పష్టం చేశారు. ఈరోజు రాజధాని పనుల పురోగతిని దగ్గరుండి పరిశీలించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.గత ప్రభుత్వ హయాంలో జగన్ మూడు రాజధానుల పేరుతో సమయాన్ని వృథా చేస్తూ ప్రజలను మోసగించారని అనిత తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుతం రూపుదిద్దుకుంటున్న అద్భుతమైన నిర్మాణాలను ప్రజాప్రతినిధులతో పాటు సామాన్య ప్రజలంతా వచ్చి చూడాలని పిలుపునిచ్చారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కృషిని ఈ సందర్భంగా కొనియాడారు.కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... రాజధాని నిర్మాణం కోసం తమ భూములను అందించిన రైతుల త్యాగాలు మరవలేనివని గుర్తుచేసుకున్నారు.

# కొత్ర గ్రామంలో భూ కబ్జాపై తహసిల్దార్ కు ఫిర్యాదు..



**నాగర్ కర్నూల్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొత్ర గ్రామ రెవెన్యూ శివారులో గల సర్వే నెంబర్ 369 లో ముస్లిం మైనార్టీలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన కె అశ్విని కాంతారావు కబ్జా చేశారని ఆ గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీలు తహసిల్దార్ కార్తీక్ కుమార్ కు ఫిర్యాదు చేశారు. మంగళవారం తహసిల్దార్ని ముస్లిం మైనార్టీలు కలిసి తమకు 369 సర్వే నెంబర్లు ఆరెకరాల 22 గుంటల భూమిని ఓఆర్సీ పట్టా ద్వారా కేటాయించడం జరిగిందని తాతల నాటి నుంచి అట్టి భూమిని సాగు చేస్తూ ప్రతి ఏటా పీర్ల పండుగను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మహబూబ్ స్వామి దర్గాను కుల మతాలకతీతంగా అక్కడికి ప్రతిరోజు వచ్చి ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు.అట్టి భూమిపై ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గ్రామానికి చెందిన అశ్విని కాంతారావు వెంకటేశ్వరరావు, రాములు అక్రమంగా కబ్జాకు పాల్పడి కంచే నిర్మాణం చేపట్టడం జరిగిందని ఇట్టి విషయంపై సమగ్రంగా విచారించి న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముస్లింనాయకులు నయీమ్, మహమ్మద్ ఖదిరుద్దీన్, ఖలీల్,షాబుద్దీన్ బషిరుద్దిన్,రవుఫ్,రమేష్,సద్దాం నజీర్, షఫీ సలీం, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు..

# కంప్యూటర్ ఆపరేటర్ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలి.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 ప్రజాబలం:**భూభారతి ఎఫ్ టి సి కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నామని సంఘ నాయకులు తెలిపారు.636 మంది భూభారతి ఎఫ్టిసి ఉద్యోగులను యధావిధిగా రెన్యువల్ చేసి కొనసాగించాలి.2 304 మందిఎఫ్టిసి ఉద్యోగులను తగ్గించే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి.

పెండింగ్ ఉన్న 15 నెలల వేతనాలను తక్షణమే విడుదల చేయాలి.భూభారతి ఫెఫ్ట్ సి ఉద్యోగుల వివరాలను ఇఫమిస్ పోర్టల్ లో నమోదు చేయాలి.

5 ప్రతినెల 1వ తేదీన వేతనాలు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలి.మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.మా ఉద్యోగాలు కాపాడండి – మా కుటుంబాలను ఆదుకోండి అని ధర్నా నిర్వహించారు

# తెలంగాణ ఉద్యమ కళాకారుల పాదయాత్ర



**ఖమ్మం/తల్లాడ ఆగస్టు 5 ప్రజాబలం:**తెలంగాణ ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగ సంక్షేమ భరోసా పథకాలు కల్పించాలని ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రెడ్డిగూడెం గ్రామం నుంచి భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవాలయం వరకు ఉద్యమ కళాకారుడు కె.వి కళాబృందం అధ్యక్షుడు కాంపల్లి వంశీ ఆధ్వర్యంలో 101 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టాడు పాదయాత్రను తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి రవి మండల గొడుగునూరి అధ్యక్షుడు జిల్లా నాయకులు జక్కంపూడి కిషోర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిజమైన ఉద్యమ కళాకారులకు అన్యాయం జరిగిందని విమర్శించారు .రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉద్యమ కళాకారులకు ఉద్యోగ భరోసా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడే ముందు ఉద్యమ కళాకారులు ఎంతో కృషి చేశారని వారు అన్నారు.కళాకారులకు తగిన ఉద్యోగ అవకాశాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు ఉద్యమ కళాకారుడు కాంపల్లి వంశీ చేపట్టిన పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు



పాదయాత్రలో కాంపల్లి వంశి జిల్లా సాంస్కృతిగా కళా మండలి అధ్యక్షులు గుడిపల్లి పుల్లారావు తాళ్లపల్లి మనోజ్ కుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుజానకిరామ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైడిపల్లి రవి, జక్కంపూడి కిషోర్,గోవింద్ శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, కృష్ణారెడ్డి, రాయల రాము, రెడ్డిగూడెం సర్పంచ్ మోదుగు తిరుమల్ రావు,ఉప సర్పంచ్ పైడిపల్లి జగన్,అంబేద్కర్ నగర్ ఉప సర్పంచ్ మర్సకట్ల బాబురావు, ఎస్.కె జానమియా ప్రభాకర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పలు జిల్లాల ఉద్యమ కళాకారులు పాదయాత్రలో పాల్గొన్నారు.

# ప్రముఖ నటుడు ప్రదీప్ రావత్ కన్నుమూతా

## బ్లడ్ క్లాట్ అవడంతో గుండెపోటుకు గురైన ప్రదీప్ రావత్ (74)



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 05 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** ముంబైలోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతూ నిన్న మంగళవారం సాయంత్రం 5.30కి తుది శ్వాస విడిచినట్లు ప్రకటించిన కుటుంబ సభ్యులు,రాజమౌళి 'సై' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైన ప్రదీప్ రావత్,ఛత్రపతి సినిమాతో విలన్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రావత్,టాలీవుడ్ లో చివరిగా "గాయపడ్డ సింహం" సినిమాలో కనిపించిన ప్రదీప్ సౌత్ లో 70 సినిమాలకు పైగా నటించిన ప్రదీప్ రావత్,బాలీవుడ్ లో "లగాన్" సినిమాతో మంచి గర్తింపుఒక్కగానొక్క కుమారుడిని హీరో చేయాలనే ప్రయత్నంలో ఉండగా ఆ కోరిక తీరకుండానే మరణించిన ప్రదీప్ రావత్.

# నాణ్యమైన నారుతోనే రైతులకు మేలు

## జిల్లా ఉద్యాన అధికారి

**వర్షాభావ పరిస్థితుల్లో మిరప సాగుపై రైతులు పునరాలోచించాలి**

**అవగాహన సదస్సులో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మధుసూధన్**

**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 ప్రజాబలం:** తెలంగాణ ప్రభుత్వం కల్తీ నారును అరికట్టి, రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన నారును అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఉద్యానశాఖ ద్వారా నర్సరీల నమోదు (రిజిస్ట్రేషన్) చేపడుతోందని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్ తెలిపారు. బుధవారం వైరా మండలం సోమవరం గ్రామ రైతు వేదికలో నిర్వహించిన మిరప రైతులు మరియు నర్సరీ యజమానుల అవగాహన సదస్సులో పాల్గొన్న ఆయన, రైతులు పంటల్లో పాటించవలసిన యాజమాన్యం పద్ధతుల గురించి మరియు డ్రిప్ ఇరిగేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి అదే విధంగా పంటల్లో వచ్చే చీడపీడలు నివారణ గురించి రైతులకి మరియు నర్సరీ యజమానికి తెలియజేశారు.ఎల్‌నీనో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు మిరప సాగుపై పునరాలోచన చేసి, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మాత్రమే సాగు చేపట్టాలని సూచించారు. మిరప సుమారు ఏడు నెలల కాలపరిమితి గల అధిక పెట్టుబడి పంట అని,



నాట్లు వేసిన దశ నుంచి కోత పూర్తయ్యే వరకు నిరంతర నీటి అవసరం ఉంటుందని తెలిపారు.

ప్రస్తుతం వర్షపాతం అనిశ్చితంగా ఉండటం, భూగర్భ జలాల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో రైతులు విచక్షణతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి అవసరం ఉండే ఉద్యాన పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా. ఆకుల వేణు, నర్సరీ యజమానులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, నాణ్యత లేని నారు విక్రయించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. నర్సరీల నమోదు, నిర్వహణ, నాణ్యత నియంత్రణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై అధికారుల ద్వారా నర్సరీ యజమానులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ ఉద్యాన అధికారి డా. ఆకుల వేణు, ఖమ్మం ఉద్యాన అధికారి జి. నగేష్, ఉద్యాన విస్తరణ అధికారి సత్యేంద్ర కుమార్, మిరప నర్సరీ యజమానులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాష్టానికి మంచి పేరు తీసుకురావాలి

## కబడ్డీ కోచ్ వేణు




**వేములవాడ, ఆగస్టు 5 (ప్రజాబలం ప్రతినిధి):**తెలంగాణలో నిర్వహిస్తున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ రాష్ట్ర యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునేందుకు మంచి వేదికగా నిలుస్తుందని కబడ్డీ కోచ్ వేణు అన్నారు. క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత విజయాలు సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

మంగళవారం మాట్లాడుతూ, ప్రతి క్రీడాకారుడు లక్ష్యసాధన కోసం అంకితభావంతో శ్రమించాలని సూచించారు. ఓటమిని నిరాశగా కాకుండా విజయానికి సోపానంగా భావించి మరింత కష్టపడాలని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి కీర్తి తీసుకురావాలని పిలుపునిచ్చారు.తెలంగాణ యువత క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని వేణు ఆకాంక్షించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com